# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టీ. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

సంపుటి : 1 సంచిక : 305 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తాడేపల్లిగూడెం గురువారం 10 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 305 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM THU 10 SEPTEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur




## నన్ను జైల్లో పెట్టగలిగారు కానీ, నా స్థైర్యాన్ని దెబ్బతీయలేకపోయారు

## చంద్రబాబు ట్వీట్

- మూడేళ్ల క్రితం తన అరెస్టును గుర్తు చేసుకున్న సీఎం చంద్రబాబు
- ప్రజల మద్దతుతో 2024 ఎన్నికల్లో నిజం గెలిచిందన్న టీడీపీ అధినేత
- రాష్ట్రవ్యాప్తంగా 'నిజం గెలిచింది' పేరుతో కార్యక్రమాల నిర్వహణ
- తెలుగు జాతిని నంబర్ 1 చేయడమే తన లక్ష్యమని పునరుద్ఘాటన

పెన్ పవర్ డెస్క్:"ప్రజల కోసం నిలబడితే ప్రజలు మన వెంట నిలబడతారు, నిజం కోసం నిలబడితే నిజమే మనల్ని నిలబెడుతుంది. ఇదే నా నమ్మకం" అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధినేత చంద్రబాబు అన్నారు.

- మిగతా 2లో

# ప్రతి వారం ప్రజల మధ్యనే ఉంటా

- కోనసీమ జిల్లాలో 'మీ భూమి - మీ హక్కు' గ్రామసభ
- సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్న చంద్రబాబు
- గత ప్రభుత్వ తప్పిదాలను సరిదిద్దుతూ రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన
- 16 లక్షల ఎకరాలను 22ఏ జాబితా నుంచి తొలగించినట్టు వెల్లడి
- భూమికి పూర్తి భద్రత కల్పించేలా రాజముద్రతో కొత్త పాస్ పుస్తకాలు
- రూ.240 కోట్లతో ఈపీడీసీఎల్ గ్రిడ్ ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన



పెన్ పవర్ డెస్క్:సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అనే మూడు మూల మంత్రాలతోనే కూటమి ప్రభుత్వం ముం దుకు సాగుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. సచివాలయానికి పరిమితమై పనిచేయడం కాకుండా, క్షేత్రస్థాయిలో ప్రజల మధ్య ఉంటూ వారి జీవితాల్లో వెలుగులు నింపడమే అసలైన సుపరిపాలన అని, దానికోసం తమ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని ఉద్ఘాటిం చారు. కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గంలోని మాచడవ పండువారిపేటలో బుధవారం నిర్వహించిన 'మీ భూమి - మీ హక్కు' గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రతి వారం ప్రజల వద్దకే వస్తున్నానని, వారి బాగోగులు తెలుసుకుంటూ పాలన సాగిస్తున్నానని తెలిపారు. ప్రతినెలా ఒకటో తేదీన పేదల వద్దకు వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ అందిస్తూ వారి కష్టసుఖాలను తెలుసుకుంటున్నానని సీఎం గుర్తుచేశారు. అలాగే, ప్రతి నెలా మూడో శనివారం 'స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర'

- మిగతా 2లో



## 53 రోజులు జైల్లో చంద్రబాబు..

## 53 కొవ్వొత్తులు వెలిగించిన నారా లోకేశ్

- చంద్రబాబు అరెస్టు జరిగి నేటికి మూడేళ్లు పూర్తి
- 'నిజం గెలిచింది' నినాదంతో నిరసన తెలిపిన నారా లోకేశ్
- 53 రోజుల నిర్బంధానికి గుర్తుగా 53 కొవ్వొత్తులు వెలిగింపు
- జగన్ కుట్రపూరితంగా తప్పుడు కేసు పెట్టారని లోకేశ్ ఆరోపణ
- ఉండవల్లి నివాసంలో జరిగిన ఈ కార్యక్రమ ఫొటోలు సోషల్ మీడియాలో షేర్

పెన్ పవర్ డెస్క్:తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్టు జరిగి నేటికి సరిగ్గా మూడేళ్లు పూర్తయిన సందర్భంగా ఏపీ మంత్రి, టీడీపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేశ్ నిరసన తెలిపారు. 'నిజం గెలిచింది' అనే నినాదంతో ఉండవల్లిలోని తన నివాసంలో 53 కొవ్వొత్తులు వెలిగించి, నాటి ఘటనను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలను ఆయన సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు.ఈ సందర్భంగా నారా లోకేశ్ స్పందిస్తూ.. మూడేళ్ల క్రితం ఇదే రోజున నాటి ముఖ్యమంత్రి జగన్ రాజకీయ దురుద్దేశంతో, కుట్రపూరితంగా తప్పుడు కేసు బనాయించి చంద్రబాబును అర్ధరాత్రి అరెస్టు చేయించారని

- మిగతా 2లో

## ఏపీలో స్థానిక ఎన్నికల పోలింగ్ కేంద్రాల ఖరారుకు షెడ్యూల్ విడుదల

- సెప్టెంబర్ 11న ఫొటో సహిత ఓటర్ల జాబితా ప్రదర్శన
- 15వ తేదీన పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితా రూపకల్పన
- 19న ఎంపీటీసీ, జెడ్పీటీసీ పోలింగ్ కేంద్రాల తుది జాబితా రూపకల్పన

- మిగతా 2లో



## స్థానిక సంస్థల ఎన్నికలు కురుక్షేత్ర సంగ్రామంలాంటివి

- అధికార దుర్వినియోగం, అక్రమ కేసులను ఎదుర్కొని వైసీపీ శ్రేణులు నిలబడాలని పిలుపు
- సర్ ప్రక్రియలో 44 లక్షల ఓట్లు గల్లంతయ్యాయని వెల్లడి
- స్థానిక ఎన్నికల్లో కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని భరోసా



పెన్ పవర్ డెస్క్:రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు ఒక 'కురుక్షేత్ర సంగ్రామం' లాంటివని వైసీపీ అధినేత జగన్ అన్నారు. అధికార దుర్వినియోగం, పోలీసు బలగాల

- మిగతా 2లో



## తిరుమల భక్తులకు ఇకపై రూ.10 లక్షల బీమా

- భక్తుల ప్రమాద బీమా రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంపు
- సహజ మరణానికి రూ.2 లక్షల బీమా
- బీమా పథకానికి ఎల్ఐసీకి రూ.2.12 కోట్ల ప్రీమియం చెల్లింపు
- లడ్డూ తయారీకి 400 అదనపు పోస్టులకు ప్రతిపాదనలు
- ఆహార వ్యర్థాలతో బయోగ్యాస్ తయారీకి ప్లాంట్

- మిగతా 2లో



తెలుగు రాష్ట్రాలకు రైల్వే శుభవార్త..

## కొత్త లైన్లకు కేంద్రం ఆమోదం

- దేశవ్యాప్తంగా రైల్వే మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం
- ఘట్కేసర్-కాజీపేట మధ్య నాలుగో లైన్‌కు గ్రీన్ సిగ్నల్
- అరక్కోణం-రేణిగుంట మధ్య 3వ, 4వ లైన్ల నిర్మాణానికి ఆమోదం
- మూడు ప్రాజెక్టుల కోసం రూ. 10,021 కోట్లు కేటాయింపు
- ఏపీ, తెలంగాణలో రైల్వే సామర్థ్యం పెంచడమే లక్ష్యం

పెన్ పవర్ డెస్క్:రైల్వే వ్యవస్థ సామర్థ్యాన్ని పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలుగు రాష్ట్రాల్లోని రద్దీ మార్గాలతో సహా దేశవ్యాప్తంగా పలు మల్టీ ట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది. ఈ వివరాలను కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ బుధవారం

- మిగతా 2లో

## మళ్లీ అదే సెంటిమెంట్‌తో... జగన్ పాదయాత్ర 2.0కు ముహూర్తం ఖరారు



- మరోసారి సుదీర్ఘ పాదయాత్రకు సిద్ధమైన వైఎస్ జగన్
- 2027 సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో యాత్ర ప్రారంభం
- బాపట్ల జిల్లా పర్చూరు కార్యకర్తల సమావేశంలో ప్రకటన
- 2029 ఎన్నికలే లక్ష్యంగా రెండో విడత యాత్రకు వ్యూహారచన
- 'ప్రజా సంకల్ప యాత్ర' సెంటిమెంట్‌నే మళ్లీ ఫాలో అవుతున్న జగన్

- మిగతా 2లో

## "బాత్రూమ్‌లోకి కూడా వస్తారా?".. మీడియాపై పినరయి విజయన్ ఫైర్

- ఈడీ కేసుపై మీడియా ప్రశ్నలకు తీవ్రంగా స్పందించిన పినరయి విజయన్
- "నాతో పాటు బాత్రూమ్‌లోకి కూడా వస్తారా?" అంటూ విలేకరులపై ఆగ్రహం
- విజయన్, ఆయన కుమార్తె, అల్లుడిపై కేసు నమోదు చేయాలని ఈడీ సిఫార్సు
- విలేకరులతో మాట్లాడటానికి విజయన్ నిరాకరించడం కొత్తేమీ కాదని విశ్లేషణలు
- గతంలోనూ మీడియా ప్రతినిధులపై ఆయన ఇలాగే ప్రవర్తించారు



పెన్ పవర్ డెస్క్:కేరళ ప్రతిపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ మరోసారి మీడియా ప్రతినిధులపై తనదైన శైలిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కేసు గురించి మీడియా వెంటపడడంతో సహనం కోల్పోయారు. "నాతో పాటు బాత్రూమ్‌లోకి కూడా వస్తారా?" అని

- మిగతా 2లో



## 'ఎంత ధైర్యం?'..

### విద్యార్థికి నోటీసులపై సుప్రీంకోర్టు ఆగ్రహం

- న్యాయ విద్యార్థికి గ్రేటర్ నోయిడా ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ నోటీసులు
- నోటీసులు ఉపసంహరించినా తీవ్రంగా స్పందించిన కోర్టు
- విద్యార్థులపై చర్యలు వద్దని గతంలోనే ఆదేశాలిచ్చామని గుర్తుచేసిన కోర్టు
- యూపీ అధికారులపై అలహాబాద్ హైకోర్టు మండిపాటు
- ఆకృతి చౌధరి ఎన్ఎస్ఏ నిర్బంధం రద్దు

- మిగతా 2లో

## ఈ20 పెట్రోల్‌తో వాహనాలకు నష్టం లేదు

- ఈ20 ఇంధనంపై తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కీలక ప్రకటన.. కేంద్రానికి మద్దతు
- తమకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని అసెంబ్లీలో వెల్లడి
- ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ వాదనకు తెలంగాణ మద్దతు



పెన్ పవర్ డెస్క్:ఇథనాల్ కలిపిన ఈ20 పెట్రోల్ వాడకం వల్ల వాహనాలు దెబ్బతింటున్నాయన్న ప్రచారంలో వాస్తవం లేదని తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ అంశంపై రాష్ట్రంలో తమకు ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని ఆయన శాసనసభలో వెల్లడించారు.ఈ20 పెట్రోల్ వల్ల వాహనాలు పాడవుతున్నట్లు వాహన యజమానుల నుంచి గానీ, ఆటోమొబైల్ రంగ నిపుణుల

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# “సేన” వాటా ఇదే

స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన డిమాండ్లు భారీగానే ఉండనున్నాయి. ఒకరకంగా టీడీపీని కొంత ఇబ్బందికరమైన పరిణామమే. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు జనసేన సిద్ధమవుతుంది. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు సంబంధించి అధికార కూటమిలో సీట్ల సర్దుబాటు, డిమాండ్ల వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. గత సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయం కోసం సీట్ల విషయంలో రాజీ పడిన జనసేన పార్టీ, ఈసారి క్షేత్రస్థాయిలో పార్టీ బలం, కార్యకర్తల ఆత్మగౌరవాన్ని దృష్టిలో ఉంచుకుని గట్టి డిమాండ్లనే ముందుంచుతోంది. తమ పార్టీ కార్యకర్తలలో జోష్ నింపాలంటే ఈ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో పోటీ చేయాలని జనసేన భావిస్తుంది. ఇప్పటికే జనసేన నుంచి నివేదిక సిద్ధమయినట్లు సమాచారం. చంద్రబాబు వద్ద చర్చల్లో ఈ నివేదిక మేరకు పెట్టే అవకాశముందని తెలిసింది.

**జనసేన ప్రధాన డిమాండ్లుఇవేనట...**

స్థానిక సంస్థల ఎన్నికల్లో 30 శాతం సీట్ల వాటాను జనసేన కోరుకుంటుంది. 2024 సార్వత్రిక ఎన్నికల నాటి తక్కువ సీట్ల ఫార్ములా స్థానిక సంస్థల ఎన్నికలకు వర్తించదని జనసేన స్పష్టం చేసింది. తెలుగుదేశం పార్టీ ప్రాథమికంగా 15% సీట్లు ఇవ్వాలని భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతుండగా, జనసేన మాత్రం కనీసం 25 నుండి 30 శాతం సీట్లను కేటాయించాలని గట్టిగా డిమాండ్ చేస్తోంది. నామినేషన్లకు ముందు ఇతర పార్టీల నుంచి వచ్చే వలస నాయకులకు జనసేన కోటాలో సీట్లు ఇవ్వకూడదని, క్షేత్రస్థాయిలో కష్టపడిన అసలైన జనసైనికులకే టికెట్లు కేటాయించాలని పార్టీ శ్రేణులు అధిష్ఠానాన్ని కోరుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఒకే ఫార్ములా కాకుండా, ఆయా జిల్లాల్లో జనసేనకు ఉన్న క్షేత్రస్థాయి బలం, సామాజిక సమీకరణల ఆధారంగా సీట్ల పంపిణీ జరగాలని కోరుతోంది. ఈ మేరకు ప్రతిపాదనలను సిద్ధం చేశారు. చంద్రబాబును ఒప్పించేందుకు కూడా పవన్ సిద్ధమయినట్లు సమాచారం.

**జనసేన ఆశిస్తున్న కార్పొరేషన్లు ఇవే...**

ముఖ్యంగా జనసేన బలంగా ఉన్న ఉమ్మడి గోదావరి, కృష్ణా, విశాఖపట్నం మరియు గుంటూరు జిల్లాల్లోని కార్పొరేషన్లపై పార్టీ ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ తో పాటు విశాఖపట్నం మేయర్ అభ్యర్థిని తమకే కేటాయించాలని అడిగే అవకాశముంది. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో విజయవాడ నగర పరిధిలో జనసేన ఒక్క సీటులో కూడా పోటీ చేయలేదు. కాబట్టి, ఈసారి విజయవాడ మేయర్ పీఠాన్ని లేదా మెజారిటీ డివిజన్లను తమకే కేటాయించాలని జనసేన నేతలు బలంగా డిమాండ్ చేస్తున్నారు.

**రాజమహేంద్రవరం కార్పొరేషన్ :**

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జనసేనకు బలమైన కోట కావడంతో, ఈ కార్పొరేషన్ మేయర్ స్థానం లేదా అత్యధిక వార్డులు తమకే దక్కాలని పట్టుబడుతోంది.

**కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్:**

కాకినాడ నగర మరియు గ్రామీణ పరిధిలో పార్టీకి ఉన్న బలమైన క్యాడర్ రీత్యా ఇక్కడ మేయర్ అభ్యర్థిత్వంపై జనసేన కన్నేసింది. విశాఖపట్నం : ఉత్తరాంధ్రలో పార్టీ ఉనికిని మరింత చాటుకునేందుకు వీలుగా విశాఖ పట్నంలోని కీలక డివిజన్లతో పాటు డిప్యూటీ మేయర్ లేదా మేయర్ రేసులో భాగస్వామ్యం కోరుతోంది. రాజధాని ప్రాంత పరిధిలోని స్థానాల్లో తగిన ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేస్తోంది తిరుపతి : తిరుపతిలోనూ జనసేన పాగా వేయాలని చూస్తుంది. తిరుపతి కార్పొరేషన్ సీటును జనసేనకు ఇవ్వాలని కోరనుంది. జనసేన తిరుపతి నియోజకవర్గం పరిధిలో బలంగా ఉండటంతో ఇక్కడ కూడా తాము పోటీ చేస్తామన్న ప్రతిపాదనతో చర్చలకు సిద్ధమవుతుంది. ఈ ప్రతిపాదనలతో టీడీపీకి కొంత ఇబ్బందికరంగా మారే అవకాశముంది. ఉత్తరాంధ్రలో, రాయలసీమలో అత్యధికంగా ఉన్న తమ పార్టీ ఎమ్మెల్యేలు కూడా ఒకవైపు డిమాండ్ చేస్తున్నారు. దీంతో ఏం జరుగుతుందన్నది ఉత్కంఠగా మారింది.

# ఈ20 పెట్రోల్‌తో వాహనాలకు నష్టం లేదు

- మొదటి పేజి తరువాయి

నుంచి గానీ రవాణా శాఖ దృష్టికి ఎటువంటి సమాచారం రాలేదని మంత్రి తెలిపారు. “ప్రస్తుతం ఈ అంశానికి సంబంధించి మా వద్ద ఎటువంటి ప్రతికూల నివేదికలు లేవు. అందువల్ల, దీనిపై ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేసే లేదా నియంత్రణ చర్యలు చేపట్టే ఆస్కారం లేదు” అని ఆయన వివరించారు. ఈ విషయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్ర ప్రభుత్వ వైఖరితోనే ఏకీభవించారు. గత జూలైలో కేంద్ర పెట్రోలియం శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపి సైతం లోక్‌సభలో ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా 20 కోట్లకు పైగా ద్విచక్ర వాహనాలు, 3 కోట్లకు పైగా పెట్రోల్ కార్లు ఇథనాల్ కలిపిన ఇంధనంతోనే నడుస్తున్నాయని, ఇంజన్ వైఫల్యాలపై ఎటువంటి నిర్దిష్ట ఫిర్యాదులు రాలేదని ఆయన వెల్లడించారు. గతంలో సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫాక్చరర్స్ (సియామ్), ఈ20 ఇంధనంలోని అధిక తేమ, క్లోరైడ్ స్థాయిల వల్ల సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పెట్రోలియం మంత్రిత్వ శాఖకు లేఖ రాసింది. అయితే, ఈ అంశంపై మరింత ధ్రువీకరణ అవసరమని పేర్కొంటూ తదనంతరం ఆ లేఖను ఉపసంహరించుకుంది. ప్రస్తుతం అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం ఈ20 ఇంధనం వల్ల వాహనాలకు ఎలాంటి ముప్పు లేదనే అభిప్రాయంతో ఉన్నాయి.

## “బాత్రూమ్‌లోకి కూడా వస్తారా?”.. మీడియాపై పినరయి విజయన్ ఫైర్

- మొదటి పేజి తరువాయి

వారిపై విరుచుకుపడ్డారు.

వివరాల్లోకి వెళితే... బుధవారం చంగనచేరికి వెళుతుండగా మార్గమధ్యంలో విజయన్ మధ్యాహ్నం కల్లిస్సేరిలోని పీడబ్ల్యూడీ రెస్ట్ హౌస్‌లో ఆగారు. అప్పటికే అక్కడ వేచి ఉన్న మీడియా ప్రతినిధులు, ఆయన కారు దిగగానే చుట్టుముట్టి ఈడీ కేసు గురించి ప్రశ్నలు సంధించారు. అయితే విజయన్ మౌనంగా రెస్ట్ హౌస్‌లోకి నడిచారు. విలేకరులు ఆయన్ను అనుసరిస్తూ లోపలికి వెళ్లి మళ్లీ అవే ప్రశ్నలు అడిగారు. ఒక గదిలోకి వెళ్లే ముందు, వెనక్కి తిరిగిన విజయన్ తీవ్ర అసహనంతో.. “నేను ఇక్కడికి వచ్చింది మిమ్మల్ని కలవడానికి కాదు” అని చెబుతూ, “నేను ఎక్కడికి వెళితే అక్కడికి వస్తారా... బాత్రూంలోకి వెళ్లినా వదలరా?” వ్యాఖ్యానించారు. అనంతరం గదిలోకి వెళ్లిపోయారు. కాసేపటి తర్వాత బయటకు వచ్చి మౌనంగానే తన వాహనంలో చంగనచేరికి వెళ్లిపోయారు.

పినరయి విజయన్, ఆయన కుమార్తె టి. వీణ, అల్లుడు, ఎమ్మెల్యే పి.ఎ. మహమ్మద్ రియాస్‌పై అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయాలని కోరుతూ ఈడీ ఇటీవల రాష్ట్ర పోలీస్ చీఫ్‌కు సిఫార్సు చేసిన సంగతి తెలిసిందే. మనీ లాండరింగ్ నిరోధక చట్టంలోని సెక్షన్ 66(2) ప్రకారం ఈడీ తన దర్యాప్తు వివరాలను, ఆధారాలను పోలీసులకు పంపింది. ఈ నేపథ్యంలో మీడియా ఆయన్ను వివరణ కోరే ప్రయత్నం చేయగా ఈ ఘటన చోటుచేసుకుంది. విజయన్ మీడియా పట్ల ఇలా కఠినంగా వ్యవహరించడం ఇది మొదటిసారి కాదు. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు దశాబ్దాలుగా కొనసాగుతున్న వారపు కేబినెట్ అనంతర మీడియా సమావేశాన్ని రద్దు చేశారు. 2017లో తిరువనంతపురంలో బీజేపీ-ఆర్ఎస్ఎస్ నేతలతో సమావేశానికి వెళ్లినప్పుడు మీడియా ప్రతినిధులను ‘బయటకు వెళ్లండి’ అంటూ గట్టిగా మందలించిన ఘటన అప్పట్లో వైరల్ అయింది. ఇప్పుడు మరోసారి ఆయన తన పాత పంథానే కొనసాగించారు.

# ప్రతి వారం ప్రజల మధ్యనే ఉంటా

- మొదటి పేజి తరువాయి

కార్యక్రమంలో, నాలుగో శనివారం పీ4 (ప్రజలు, ప్రైవేట్, ప్రభుత్వ భాగస్వామ్యం) కార్యక్రమంలో పాల్గొంటూ ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో అభివృద్ధి జరిగితేనే సంపద సృష్టి జరుగుతుందని, తద్వారా ప్రజలంతా గౌరవంగా జీవించేలా చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.ం

**భూమికి భద్రత.. గత ప్రభుత్వ పాపాల ప్రక్షాళన**

ప్రతి నెలా 9వ తేదీన ‘మీ భూమి - మీ హక్కు’ కార్యక్రమం ద్వారా రైతులకు, యజమానులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను అందిస్తున్నామని సీఎం తెలిపారు. భూమిపై యజమానులకు తిరుగులేని హక్కులు కల్పించడమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. గత పాలకులు తమ ఐదేళ్ల పాలనలో రెవెన్యూ వ్యవస్థను పూర్తిగా ధ్వంసం చేశారని, రికార్డులను తారుమారు చేసి ఘోరాలు, నేరాలు, పాపాలు చేశారని తీవ్రస్థాయిలో విమర్శించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరుతో ప్రజల భూములను కాజేసేందుకు కుట్ర పన్నారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ ప్రమాదకర చట్టాన్ని రద్దు చేసి ప్రజలకు భరోసా ఇచ్చిందని గుర్తుచేశారు.“రీసర్వే పేరుతో గత ప్రభుత్వం చేసిన అరాచకాలు అన్నీ ఇన్నీ కావు. పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన భూములపై కూడా తమ ఫొటోలు వేసుకున్నారు. సర్వే రాళ్లపై బొమ్మలు వేసుకునే పిచ్చి ఏమిటో ఎవరికీ అర్థం కాలేదు. తమకు ఇష్టం లేని వ్యక్తుల భూములను, ఆస్తులను 22ఏ జాబితాలో చేర్చి వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. అందుకే ఇప్పుడు పటిష్ఠమైన రీసర్వే ప్రక్రియను పూర్తి చేసి, ఎక్కడా అవకతవకలకు తావులేకుండా బ్లాక్ చెయిన్ టెక్నాలజీ, ఈ-కేవైసీ, క్యూఆర్ కోడ్ వంటి భద్రతా ఫీచర్లతో రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను అందిస్తున్నాం”అని చంద్రబాబు వివరించారు.

**రికార్డు స్థాయిలో రెవెన్యూ సంస్కరణలు**

భూమికి సంపూర్ణ భద్రత కల్పించడమే కూటమి ప్రభుత్వ అజెండా అని సీఎం స్పష్టం చేశారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 8,234 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి, 36 లక్షల మందికి రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలు అందించామని తెలిపారు. వచ్చే ఏడాది మార్చి నాటికి మిగిలిన 8,582 గ్రామాల్లో సర్వే పూర్తి చేసి మొత్తం 56 లక్షల పాస్ పుస్తకాలు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. రిజిస్ట్రేషన్ జరిగిన వెంటనే ఆటో మ్యూటేషన్ సేవలు అందుబాటులోకి తెచ్చామని, వారసత్వ భూముల విభజనలో స్టాంప్ డ్యూటీని కేవలం రూ.1000కి పరిమితం చేయడం ద్వారా 1.25 లక్షల కుటుంబాలకు ప్రయోజనం చేకూర్చామని చెప్పారు.

గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతూ రాష్ట్రవ్యాప్తంగా 16 లక్షల ఎకరాలను 22ఏ జాబితా నుంచి తొలగించి లక్షలాది మందికి ఊరట కల్పించామని అన్నారు. శెట్టిపల్లి కంగుంది, వట్టిచెరుకూరు, ముదినేపల్లి వంటి ప్రాంతాల్లో దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న 244 కీలక భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించామని తెలిపారు. అమలాపురం, ముమ్మిడివరం, రామచంద్రాపురంలో బ్రిటిష్ కాలం నాటి (1908) 22ఏ(1) నిషేధిత భూముల సమస్యను కూడా పరిష్కరిస్తున్నామని, దీని ద్వారా 1410 మందికి చెందిన 56.37 ఎకరాల భూమికి విముక్తి కల్పిస్తున్నామని ప్రకటించారు. “గొడ్డలి పార్టీ తారుమారు చేసిన రికార్డులను ప్రక్షాళన చేసి భూ సమస్యలను కొలిక్కి తెస్తున్నాం” అని ఆయన వ్యాఖ్యానించారు.

**ప్రజల సంక్షేమమే ప్రథమ ప్రాధాన్యం**

భూమి భద్రతతో పాటు నీటి భద్రతకు కూడా తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని సీఎం అన్నారు. ఈ ఏడాది తీవ్రమైన ఎల్ నినో ప్రభావం ఉన్నప్పటికీ, గోదావరి నుంచి వెయ్యి టీఎంసీలకు పైగా నీరు సముద్రంలో వృథాగా కలిసిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత పాలకుల నిర్లక్ష్యం, రాజకీయ కక్షతో కాంట్రాక్టర్‌ను మార్చడం వల్లే పోలవరం డయాఫ్రామ్ వాల్ కొట్టుకుపోయి ప్రాజెక్టు ఆలస్యమైందని ఆరోపించారు. 2024 ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు ఢిల్లీలో సంజీవనిలా పనిచేసిందని, కేంద్రం నుంచి రాష్ట్రానికి ఎక్కువ నిధులు తెచ్చుకోగలుగుతున్నామని చెప్పారు.

ఈ సందర్భంగా, తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) రూ.240 కోట్ల వ్యయంతో చేపట్టిన గ్రిడ్ ఆధునీకరణ, 3-ఫేజ్ విద్యుత్ సరఫరా పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, వాసంశెట్టి సుభాష్, అమలాపురం ఎంపీ గంటి హరీశ్, స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# నన్ను జైల్లో పెట్టగలిగారు కానీ, నా స్థైర్యాన్ని దెబ్బతీయలేకపోయారు

- మొదటి పేజి తరువాయి

మూడేళ్ల క్రితం స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో తనను అరెస్టు చేసిన ఘటనను గుర్తు చేసుకుంటూ ఆయన బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆనాటి పరిణామం తనలో విశ్వాసాన్ని మరింత పెంచిందని పేర్కొన్నారు.

గత ప్రభుత్వ హయాంలో ఏ తప్పు చేయని తనను కుట్రపూరితంగా అరెస్టు చేసి, 53 రోజుల పాటు జైల్లో నిర్బంధించారని చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. “నన్ను జైల్లో పెట్టగలిగారు కానీ, నా స్థైర్యాన్ని దెబ్బతీయలేకపోయారు. వారి రాక్షస చర్యకు నేను కుంగిపోలేదు, లొంగిపోలేదు. దీనికి కారణం నాకు లభించిన ప్రజా మద్దతు” అని ఆయన తెలిపారు. ఆ క్లిష్ట పరిస్థితుల్లో ప్రజాస్వామ్యం కోసం నిలబడిన తెలుగు ప్రజలు, కార్యకర్తలు, అభిమానులు చూపిన సంఘీభావం తన జీవితంలో మరువలేనిదని అన్నారు. తనను నిర్బంధించినా, దేశ విదేశాల్లో తన కోసం ప్రజలు ఎత్తిన గొంతును నొక్కలేకపోయారని చంద్రబాబు పేర్కొన్నారు.

2024 ఎన్నికల్లో ప్రజలు ఓటు ద్వారా తమ మద్దతును మరింత బలంగా చాటారని చంద్రబాబు అన్నారు. కక్షసాధింపు రాజకీయాలను ఓడించి,

నిజాన్ని గెలిపించి రాష్ట్ర పునర్నిర్మాణ బాధ్యతను తనకు అప్పగించారని తెలిపారు. ఆనాటి పోరాటాన్ని గుర్తు చేసుకుంటూ రాష్ట్రవ్యాప్తంగా ‘నిజం గెలిచింది’ పేరుతో కార్యక్రమాలు నిర్వహించడం, ప్రజల కోసం మరింత కష్టపడాలనే సంకల్పాన్ని బలపరిచిందని వివరించారు. ఈ సందర్భంగా తనకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ మరోసారి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజలందరి సహకారంతో తెలుగు జాతిని నంబర్ 1 చేయాలనే తన కలను నిజం చేసి తీరుతానని చంద్రబాబు మాట ఇచ్చారు.

# తిరుమల భక్తులకు ఇకపై రూ.10 లక్షల బీమా

శ్రీవారి దర్శనానికి వచ్చి ప్రమాదవశాత్తూ మరణించే భక్తుల కుటుంబాలకు అందించే బీమా మొత్తాన్ని రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలని ‘తిరుమల తిరుపతి దేవస్థానం’ (టీటీడీ) బోర్డు నిర్ణయించింది. సహజ మరణం సంభవించినా రూ.2 లక్షలు అందించేలా గ్రూప్ ఇన్సూరెన్స్ పథకాన్ని అమలు చేయనుంది. దేశంలోనే తొలిసారిగా ఎల్ఐసీ ద్వారా ఈ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు టీటీడీ వెల్లడించింది.

తిరుమలలో జరిగిన పాలకమండలి సమావేశంలో ఈ నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు వివరాలను వెల్లడించారు. భక్తులు, ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ పలు నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. బీమా పథకం అమలుకు టీటీడీ నిధుల నుంచి ఎల్ఐసీకి రూ.2.12 కోట్లు చెల్లించేందుకు ఆమోదం తెలిపినట్లు చెప్పారు.సీపీఎస్, ఎన్‌పీఎస్ పెన్షనర్లు, వారి కుటుంబాలకు ఈహెచ్ఎఫ్ సౌకర్యం కల్పించేందుకు రూ.2 కోట్ల యాజమాన్య వాటాకు ఆమోదం తెలిపారు. టీటీడీలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 48 మంది ఉద్యోగుల వేతనాలు పెంచాలని నిర్ణయించారు. శ్రీవారి పోటులో లడ్డూల తయారీ వేగం పెంచేందుకు 400 అదనపు అవుట్‌సోర్సింగ్ పోస్టుల భర్తీకి ప్రభుత్వ అనుమతి కోరుతూ ప్రతిపాదనలు పంపనున్నారు.తిరుమలలోని అన్నప్రసాద కేంద్రం, క్యాంటీన్లు, హోటళ్ల నుంచి వచ్చే ఆహార వ్యర్థాలతో బయోగ్యాస్ తయారు చేయనున్నారు. ఇందుకోసం ప్లాంట్ నిర్వహణ బాధ్యతలను రూ.2.80 కోట్లతో జీపీఎస్ రెన్యువబుల్స్‌కు అప్పగించేందుకు ఆమోదం తెలిపారు. పారిశుద్ధ్య సిబ్బందికి రవాణా ఛార్జీల కోసం మూడేళ్లకు రూ.1.60 కోట్లు కేటాయించారు.నారాయణవనంద

ఆలయంలో అమ్మవారి పద్మపీఠానికి బంగారు తాపడం చేయాలని నిర్ణయించారు. చెన్నైలోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయ ధ్వజస్తంభం, బలిపీఠానికి బంగారు తాపడం కోసం రూ.17.05 కోట్లకు ఆమోదం తెలిపారు. తిరుపతిలోని తెలుగు, సంస్కృత అకాడమీకి కేటాయించిన టీటీడీ భవనం లైసెన్స్ గడువును మరో మూడేళ్లు పొడిగించారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌కు ఆమోదించిన రూ.49 కోట్ల ఆర్థిక సహాయంలో రెండో విడతగా రూ.7.56 కోట్లు విడుదల చేయాలని నిర్ణయించారు.

## మళ్లీ అదే సెంటిమెంట్‌తో... జగన్ పాదయాత్ర 2.0కు ముహూర్తం ఖరారు

వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మరోసారి సుదీర్ఘ పాదయాత్రకు సిద్ధమవుతున్నారు. 2029 ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రజల్లోకి వెళ్లేందుకు ఆయన ప్రణాళికలు రచిస్తున్నారు. ఇందులో భాగంగా తాను చేపట్టబోయే రెండో విడత పాదయాత్రకు ముహూర్తం ఖరారు చేశారు. 2027 సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో తన పాదయాత్ర ప్రారంభమవుతుందని స్పష్టత ఇచ్చారు. నేడు బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గ వైసీపీ కార్యకర్తల సమావేశంలో జగన్ ఈ కీలక ప్రకటన చేశారు. గతంలో అధికారం కోసం జగన్ ఇదే ఫార్ములాను అనుసరించిన విషయం తెలిసిందే. 2017 నవంబర్ 6న కడప జిల్లా ఇడుపులపాయలో ‘ప్రజా సంకల్ప యాత్ర’ పేరుతో ఆయన తన తొలి పాదయాత్రను ప్రారంభించారు. ఆ యాత్ర 341 రోజుల పాటు ఏకధాటిగా సాగి, 3,648 కిలోమీటర్ల దూరం కొనసాగింది. 2019 జనవరి 9న శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో యాత్ర ముగిసింది. ఈ యాత్రలో భాగంగానే ఆయన ‘నవరత్నాలు’ పథకాలను ప్రకటించారు. ప్రజల నుంచి వచ్చిన అపూర్వ స్పందన, యాత్రలో తెలుసుకున్న సమస్యల ఆధారంగా రూపొందించిన ఈ హామీలు 2019 ఎన్నికల్లో వైసీపీకి చారిత్రాత్మక విజయాన్ని అందించాయి. మళ్లీ అదే సెంటిమెంట్‌తో 2029 ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా జగన్ ఈ రెండో పాదయాత్రకు సిద్ధమయ్యారు. 2027లో యాత్ర ప్రారంభించి, ఎన్నికల వరకు దాదాపు రెండేళ్ల పాటు ప్రజల మధ్యే ఉండాలని ఆయన భావిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ యాత్ర ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవడంతో పాటు ప్రస్తుత కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని జగన్ వ్యూహరచన చేస్తున్నారు. త్వరలోనే ఈ పాదయాత్రకు సంబంధించిన పూర్తి షెడ్యూల్, రూట్‌మ్యాప్‌పై స్పష్టత రానుంది. మొత్తం మీద 2029 ఎన్నికల సమరానికి జగన్ ఇప్పటినుంచే ‘పాదయాత్ర 2.ా’తో సిద్ధమవుతున్న సంకేతాలు పంపారు.

## ‘ఎంత ధైర్యం?’.. విద్యార్థికి నోటీసులపై సుప్రీంకోర్టు ఆగ్రహం

నిరసనలో పాల్గొన్న ఓ న్యాయ విద్యార్థికి నోటీసులు జారీ చేయడంపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. విద్యార్థులపై చర్యలు తీసుకోవద్దని సెప్టెంబర్ 1న దేశవ్యాప్తంగా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా.. న్యాయ విద్యార్థికి గ్రేటర్ నోయిడా ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ నోటీసులు ఇవ్వడాన్ని తప్పుపట్టింది. ఆ నోటీసులను తర్వాత ఉపసంహరించుకున్నప్పటికీ.. ఈ వ్యవహారం చాలా తీవ్రమైనదని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో పాల్గొన్నందుకు విద్యార్థికి ఈ నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. ఈ విషయం బుధవారం సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం దృష్టికి వచ్చింది. “మేజిస్ట్రేట్ నోటీసులు ఇచ్చే ధైర్యం ఎలా చేశారు? ఏ విద్యార్థిపైనా బలవంతపు చర్యలు తీసుకోవద్దని మేం స్పష్టంగా చెప్పాం. ఆ ఆదేశాలను ఏ మేజిస్ట్రేట్ ఉల్లంఘించకూడదు” అని సీజేఐ వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో విద్యార్థి కార్యకర్త ఆకృతి చౌధరిపై ‘జాతీయ భద్రతా చట్టం’ (ఎన్ఎస్ఏ) ప్రయోగించిన విషయంలో అలహాబాద్ హైకోర్టు కూడా యూపీ అధికారులను తీవ్రంగా మందలించింది. అధికారుల చర్యల వల్ల ఉత్తరప్రదేశ్ ‘ఆర్వెలియన్ డిస్టోపియా’గా మారే పరిస్థితి వస్తుందని హెచ్చరించింది. అధికారులు తమ విధేయత రాజ్యాంగం పట్ల ఉండాలి తప్ప రాజకీయ నేతల పట్ల కాదని స్పష్టం చేసింది. నోయిడా డిస్ట్రిక్ మెజిస్ట్రేట్ మేధా రూపమ్ ఆమోదించిన ఆకృతి చౌధరి ఎన్ఎస్ఏ నిర్బంధాన్ని సెప్టెంబర్ 2న హైకోర్టు కొట్టివేసింది. ఆమెకు రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని ఆదేశించింది. నిరసనకు సంబంధించిన కేసుల్లో తగిన ఆధారాలు లేకుండానే కఠినమైన ఎన్ఎస్ఏను ప్రయోగించడంపై గౌతమ్ బుద్ధ నగర్ జిల్లా యంత్రాంగం, పోలీసులపై ధర్మాసనం మండిపడింది.

## ఏపీలో స్థానిక ఎన్నికల పోలింగ్ కేంద్రాల ఖరారుకు షెడ్యూల్ విడుదల

ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ దిశగా రాష్ట్ర ఎన్నికల సంఘం వడివడిగా అడుగులు వేస్తోంది. రాబోయే ఎన్నికలకు సంబంధించి ఫొటోలతో కూడిన పూర్తిస్థాయి ఓటర్ల జాబితాలను తక్షణమే సిద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఓటర్ల జాబితా రూపకల్పనలో ఎటువంటి లోపాలకు తావులేకుండా పక్కాగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.

**ఎన్నికల సంఘం షెడ్యూల్ వివరాలు:**

సెప్టెంబర్ 11: ఫొటో సహిత ఓటర్ల జాబితాల ప్రదర్శన

సెప్టెంబర్ 14: పోలింగ్ కేంద్రాల ముసాయిదా (ఐత్ఖుట్) జాబితా రూపకల్పన

సెప్టెంబర్ 15: పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితా అధికారిక ప్రచురణ

సెప్టెంబర్ 15, 16: పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలు, మార్పులు-చేర్పుల వినతుల స్వీకరణ

సెప్టెంబర్ 16: రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల కమిషన్ అధికారుల సమన్వయ సమావేశం

సెప్టెంబర్ 18: పోలింగ్ స్టేషన్ల జాబితాకు జిల్లా కలెక్టర్ల ఆమోదం

సెప్టెంబర్ 19: ఎంపీటీసీ, జెడ్పీటీసీ పోలింగ్ కేంద్రాల తుది జాబితా ప్రచురణ.

## తెలుగు రాష్ట్రాలకు రైల్వే శుభవార్త.. కొత్త లైన్లకు కేంద్రం ఆమోదం

- మొదటి పేజి తరువాయి

మీడియాకు వెల్లడించారు.కేబినెట్ నిర్ణయం ప్రకారం, తెలంగాణలోని ఘట్‌కేసర్-కాజీపేట సెక్షన్‌లో నాలుగో లైను నిర్మాణానికి ఆమోదం లభించింది. 110 కిలోమీటర్ల ఈ ప్రాజెక్టుకు రూ. 2,419 కోట్లు అవుతుందని అంచనా ఉంది. అదేవిధంగా, ఆంధ్రప్రదేశ్ మీదుగా సాగే అరక్కోణం-రేణిగుంట మార్గంలో 3వ, 4వ లైన్ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ ప్రాజెక్టుల పూర్తితో ఆయా మార్గాల్లో రైళ్ల రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి.నాలుగు రాష్ట్రాల్లోని 17 జిల్లాల పరిధిలో నాలుగు లైన్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 10,021 కోట్లుగా కేంద్రం పేర్కొంది. దీంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక పరిధిలో ఐదు మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులు రాబోతున్నాయి.కొత్త లైన్ల నిర్మాణం ద్వారా రైల్వే నెట్‌వర్క్ సామర్థ్యం పెరగడమే కాకుండా, సరుకు రవాణా, ప్రయాణికుల రైళ్ల వేగం కూడా పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. వీటిని 2029-30 నాటికి పూర్తి చేయాలని ప్రణాళిక వేసింది.

## స్థానిక సంస్థల ఎన్నికలు కురుక్షేత్ర సంగ్రామంలాంటివి

- మొదటి పేజి తరువాయి

ప్రయోగం, అక్రమ కేసులను ఎదుర్కొని వైసీపీ కార్యకర్తలు గట్టిగా నిలబడాలని పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో ఈరోజు నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల పేరిట చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల వెనుక స్థానిక ఎన్నికలను తప్పించుకునే కుట్ర ఉందనే అనుమానాలు ఉన్నాయన్నారు.సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా ఇప్పటికే 44 లక్షల ఓట్లు గల్లంతయ్యాయని ప్రభుత్వ వర్గాలే చెబుతున్నాయంటే, ఎన్నికలు ఏ రీతిలో సజావుగా జరుగుతాయో అర్థం చేసుకోవచ్చని జగన్ ప్రశ్నించారు. చంద్రబాబు సీఎంగా ఉన్నంత కాలం పారదర్శక ఎన్నికలు సాధ్యం కావని... నిత్యం ఏదో ఒక డ్రామా ఆడుతూ, డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెడుతున్నారని విమర్శించారు.గతంలో 23 మంది వైసీపీ ఎమ్మెల్యేలను తీసుకెళ్లిన చంద్రబాబుకు 2019 ఎన్నికల్లో ప్రజలు అదే 23 సీట్లకు పరిమితం చేసి గుణపాఠం చెప్పారని గుర్తుచేశారు. దౌర్జన్యాలు, అబద్ధాలు ఎల్లకాలం సాగవని, రాబోయే స్థానిక ఎన్నికల్లో కార్యకర్తలకు పార్టీ పూర్తి అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

## 53 రోజులు జైల్లో చంద్రబాబు.. 53 కొవ్వొత్తులు వెలిగించిన నారా లోకేశ్

- మొదటి పేజి తరువాయి

ఆరోపించారు. ఆ కేసులో చంద్రబాబును 53 రోజుల పాటు అక్రమంగా జైలులో నిర్బంధించారని ఆయన పేర్కొన్నారు. ఆ చీకటి రోజులకు గుర్తుగా, నాటి నిర్బంధాన్ని నిరసిస్తూ 53 కొవ్వొత్తులు వెలిగించినట్లు లోకేశ్ వివరించారు.నాటి సంఘటన ప్రజాస్వామ్యానికే చీకటి రోజు అని, అయితే చివరికి నిజమే గెలిచిందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ప్రజల ఆశీర్వాదంతో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రావడమే దీనికి నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు.

# వర్షాలు కురవాలని శివయ్యకు జలాభిషేకం

**వై రామవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 9 :** వర్షాలు కురవాలని, పంటలు పండాలని మండలంలో చవిటి దిబ్బలు పంచాయితీ పూతి గుంట శివాలయంలో భక్తులు శివలింగానికి బుధవారం ఉదయం జలాభిషేకం నిర్వహించారు. ఎల్ నినో ప్రభావంతో వర్షాలు పడకపోవడంతో వ్యవసాయదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. వ్యవసాయదారులు అందరూ బుధవారం ఉదయం పక్కనే ఉన్న పెద్దేరు నుండి జలాలను తీసుకుని వచ్చి శివాలయంలో ఉన్న ఉబ్బలింగేశ్వర స్వామి విగ్రహానికి భక్తిశ్రద్ధలతో జలాభిషేకం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ వర్షాలు కురవాలని పంటలు పండాలని మొక్కుకున్నామని తెలిపారు.



పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

# యువత జాబ్‌మేళా అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి






- **నైపుణ్యాలను పెంచుకుని ఉన్నత స్థాయికి ఎదగాలి: కలెక్టర్ దినేష్‌కుమార్**
- **40 కంపెనీల్లో 1,500 ఉద్యోగావకాశాలు.. 212 మందికి ఆఫర్ లెటర్లు**

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ సెప్టెంబర్ 9:** గిరిజన ఏజెన్సీ ప్రాంత యువత జాబ్‌మేళాల్లో లభించే ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా, సామాజికంగా స్వావలంబన సాధించాలని పోలవరం జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ కే. దినేష్‌కుమార్ పిలుపునిచ్చారు. ఉద్యోగంలో చేరిన అనంతరం అనుభవం, నైపుణ్యాలను పెంపొందించుకుంటూ ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. రంపచోడవరంలోని లియోనోరా డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, వికాస ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు కలెక్టర్ దినేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంత యువతలో ప్రతిభ, కష్టపడే తత్వం, క్రమశిక్షణ, విశ్వసనీయత వంటి లక్షణాలు ఉన్నాయని అన్నారు. పరిశ్రమలు, కార్పొరేట్ సంస్థల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకుని అందుబాటులో ఉన్న ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. జిల్లాలోని పోలవరం, రంపచోడవరం, చింతూరు తదితర ప్రధాన కేంద్రాల్లో ప్రతి నెలా జాబ్‌మేళాలు నిర్వహించి పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుత మెగా జాబ్‌మేళాలో 40కి పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొని సుమారు 1,500 ఉద్యోగావకాశాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. జిల్లాలోని 12 మండలాల నుంచి 396 మంది యువతీ యువకులు రిజిస్ట్రేషన్ చేసుకోగా, 212 మంది వివిధ ప్రైవేట్ కంపెనీలకు ఎంపికై ఆఫర్ లెటర్లు పొందారని తెలిపారు. యువతకు వివిధ రంగాల్లోని కెరీర్ అవకాశాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కెరీర్ కౌన్సెలింగ్ సెల్ ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఉపాధ్యాయ, పోలీస్ ఉద్యోగాలతో పాటు ఐటీ, బ్యాంకింగ్, కార్పొరేట్ రంగాల్లో అవకాశాలపై మార్గనిర్దేశం చేస్తామన్నారు. ప్రముఖ సంస్థల భాగస్వామ్యంతో ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించి, శిక్షణ అనంతరం ఉద్యోగాలు కల్పించే కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రారంభంలో రూ. 12 వేలు, రూ. 15 వేల వేతనం వచ్చినా నిరాశ చెందకుండా అనుభవం, నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. భవిష్యత్తులో రూ. 30 వేల నుంచి రూ. 40 వేలకుపైగా సంపాదించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. స్థానిక అవకాశాలతో పాటు హైదరాబాద్, విశాఖపట్నం వంటి నగరాల్లో లభించే ఉద్యోగాలను కూడా సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

**అవకాశాలను సీరియస్‌గా తీసుకోవాలి: జేసీ**

జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న జాబ్‌మేళాను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్‌కుమార్ కోరారు. ఎస్ఎస్‌సీ నుంచి పోస్ట్‌గ్రాడ్యుయేషన్ వరకు వివిధ విద్యార్హతలు కలిగిన వారికి రూ. 15 వేల నుంచి రూ. 60 వేల వరకు వేతనాలతో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఉద్యోగ మార్కెట్లో పోటీ తీవ్రంగా ఉన్నందున అందుబాటులోకి వచ్చిన అవకాశాలను సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. ఈ మేళాలో ఎంపిక కాని అభ్యర్థులు నిరాశ చెందకుండా తమ లోపాలను గుర్తించి, రాబోయే మూడు, నాలుగు నెలల్లో నైపుణ్యాలను మెరుగుపరుచుకుని తదుపరి అవకాశాలకు సిద్ధం కావాలని అన్నారు. ఇటువంటి జాబ్‌మేళాలను జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో నిరంతరం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వికాస డైరెక్టర్ లచ్చారావు, లియోనోరా డిగ్రీ కళాశాల ప్రతినిధి ఇందిరా జాన్ రత్నం, జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి నిరుపమ, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి పెరుమాళ్లరావు, మేనేజర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# కూటమి జడ్పీటీసీ రేసులో పద్దం వెంకటకృష్ణ!

**జీలుగుమిల్లిలో ప్రచారం ముమ్మరం.. గ్రామాల్లో విస్తృత పర్యటనలు**

**సేవా కార్యక్రమాలే బలంగా.. అభివృద్ధి, సంక్షేమమే ఎజెండాగా జనసేన సీనియర్ నాయకుడి ముందడుగు**






**జీలుగుమిల్లి, పెన్ పవర్, సెప్టెంబర్ 9:** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఏలూరు జిల్లా పోలవరం నియోజకవర్గంలోని జీలుగుమిల్లి మండల జడ్పీటీసీ స్థానం రాజకీయంగా వేడెక్కుతోంది. కూటమి అభ్యర్థిత్వం కోసం జనసేన సీనియర్ నాయకుడు పద్దం వెంకటకృష్ణ తన ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నారు. టీడీపీ--జనసేన--బీజేపీ కూటమి మద్దతుతో జడ్పీటీసీగా బరిలో నిలిచి విజయం సాధించాలనే లక్ష్యంతో మండలంలోని గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తూ ప్రజలను కలుస్తున్నారు.

ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేయడమే తన ప్రధాన లక్ష్యమని వెంకటకృష్ణ చెబుతున్నారు. మండల సమగ్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం, గ్రామీణ మౌలిక వసతుల కల్పన తన ప్రాధాన్య అంశాలని పేర్కొంటున్నారు.

**సేవే రాజకీయ బలంగా..**

రాజకీయాలతో పాటు ప్రజా సేవా కార్యక్రమాల్లోనూ ముందుంటున్న పద్దం వెంకటకృష్ణ ఇప్పటికే మండల ప్రజల్లో తనదైన గుర్తింపు తెచ్చుకున్నారని ఆయన అనుచరులు చెబుతున్నారు. అంబేద్కర్ జయంతి వేడుకలకు భారీ విరాళాల అందజేత, పలు గ్రామాల్లో పేదలు, వృద్ధులకు దుస్తుల పంపిణీ, యువతకు క్రీడా సామగ్రి అందజేత వంటి కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. అంతేకాకుండా మండలానికి చెందిన సుమారు 40 మంది జర్నలిస్టులకు హెల్మెట్ల పంపిణీ చేపట్టడం కూడా ఆయన సేవా కార్యక్రమాల్లో భాగంగా నిలిచింది.

**తాగునీరు.. రోడ్లు.. డ్రైనేజీపై ఫోకస్**

జీలుగుమిల్లి మండలంలోని గ్రామాల్లో ప్రధాన సమస్యలుగా ఉన్న తాగునీరు, రహదారులు, డ్రైనేజీ అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని వెంకటకృష్ణ పేర్కొన్నారు. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు గ్రామీణ రహదారులను మెరుగుపరచడం, డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేయడం తన ప్రాధాన్య కర్తవ్యాలుగా చెప్పారు. అదేవిధంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా తన వంతు కృషి చేస్తానన్నారు. "ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే వ్యక్తిగా సేవ చేస్తున్నాను. జడ్పీటీసీగా అవకాశం కల్పిస్తే మరింత బాధ్యతతో మండల అభివృద్ధికి పనిచేస్తాను" అని వెంకటకృష్ణ పేర్కొన్నారు.'

**కూటమి గెలుపుపై ధీమా**

జీలుగుమిల్లి జడ్పీటీసీ స్థానాన్ని ఈసారి భారీ మెజారిటీతో కైవసం చేసుకుంటామని కూటమి శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తే విజయం ఖాయమని అంటున్నారు. పద్దం వెంకటకృష్ణకు కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అండగా నిలిచి విజయానికి కృషి చేయాలని పిలుపునిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల సమయం దగ్గరపడుతున్న కొద్దీ జీలుగుమిల్లి జడ్పీటీసీ స్థానంపై రాజకీయ ఆసక్తి పెరుగుతోంది. కూటమి అభ్యర్థిత్వం కోసం పద్దం వెంకటకృష్ణ చేస్తున్న విస్తృత ప్రచారం ప్రస్తుతం మండల రాజకీయ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.








# వికాస ఆధ్వర్యంలో సెప్టెంబర్ 11న జాబ్ మేళా

– కలెక్టర్ కీర్తి చేకూరి

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, సెప్టెంబర్ 9:** వికాస ఆధ్వర్యంలో సెప్టెంబర్ 11, శుక్రవారం ఉదయం 9.30 గంటలకు యాక్సిస్ బ్యాంకు, ఎన్ఐఐటి ఐసిఐసి బ్యాంకు లలో రిలేషన్ షిప్ మేనేజర్ పోస్టుకు, టాటా ఎలక్ట్రానిక్స్, ఫోక్సకన్, టీవీఎస్ సుందరం ఫాస్టనర్స్, ప్రీమియర్ ఎనర్జీ, నేషనల్ మార్ట్ కంపెనీలో ఆపరేటర్, టెక్నీషియన్, కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహింపబడును. రాజమహేంద్రవరం కలెక్టరేట్ పరిసరాల్లోని వికాస కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి బుధవారం ఒక ప్రకటనలో తెలియచేశారు. ఈ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, బీటెక్, ఉత్తీర్ణులైన 30 ఏళ్ల లోపు అర్హులైన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపికైన వారికి నెలకు 10,000 నుండి 25,000 రూపాయల వరకు వేతనం, అదనంగా ఇన్సెంటివ్ కూడా పొందగలరు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు శుక్రవారం ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో బొమ్మూరు కలెక్టరేట్ లో ఉన్న వికాస కార్యాలయలో' హాజరు కావాల్సిందిగా వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.లచ్చరావు తెలిపారు.


# విష కాలుష్యం వెదజల్లే పేపర్ మిల్లు పై చర్యలకు ప్రభుత్వం వెనకంజ




- కూటమి ప్రభుత్వంలో
- ఉప ముఖ్యమంత్రి కి విలువ లేదా ?
- మీడియా సమావేశంలో అర్పిసీ అధ్యక్షుడు మేడా ఆగ్రహం

**రాజమహేంద్రవరం, పెన్ పవర్ సెప్టెంబర్ 9:** ప్రభుత్వం హామీ ఇచ్చి నట్టుగా వచ్చే ఏడాది జరిగే గోదావరి పుష్కరాలకు కాలుష్య రహిత, పవిత్ర స్నానాలు భక్తులకు సాధ్యం కాదనే అనుమానాలు కలుగుతున్నాయని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మేడా శ్రీనివాసు ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, గత 30 సంవత్సరాలుగా పేపర్ మిల్లు కాలుష్యానికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు జరుగుతున్న ప్పటికీ గత ప్రభుత్వాల్లో స్పందన కరువైందన్నారు. కూటమి ప్రభుత్వంలో ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యక్షంగా గత మే నెలలో ప్రజా ప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు, కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో పేపర్ మిల్లు కాలుష్య , విషరసాయనాలను నిర్ధారించారని అన్నారు. అయితే మూడు నెలలు గడుస్తున్నప్పటికీ పేపర్ మిల్లు పై ఎటువంటి శాఖ పరమైన చర్యలు లేవని విమర్శించారు. మిల్లు కాలుష్యంపై ప్రజాప్రతినిధులు, అధికారులపై పవన్ ఆగ్రహం ఉత్తిదేనా ? ఎద్దేవా చేసారు. స్థానిక సంస్థలకు రూ .32 కోట్ల పన్ను బకాయిలు చెల్లించ డం లేదన్నారు. సామాన్యులుపన్ను బకాయిలు చెల్లించకపోతే విరుచుకుపడే అధికార యంత్రాంగం మిల్లు పట్ల ఎందుకు సానుభూతి చూపుతున్నారని ప్రశ్నించారు. మిల్లు కాలుష్యం పై రాష్ట్ర ప్రభుత్వం విధించిన రూ 21కోట్ల రూపాయలు వసూళ్లు చేయకపోవడం ప్రభుత్వ అసమర్ధత ఉందన్నారు. గోదావరి పుష్కరాల పై కాలుష్య రహిత జలాల కోసం, భక్తుల భద్రత కోసం చేపట్టవలసిన చర్యలపై పార్టీ ప్రభుత్వానికి నివేదిక పంపించిందన్నారు. ముఖ్యమంత్రి పర్యటన తర్వాత మిల్లు కాలుష్యం 95 శాతం వరకు పెరిగిందని, కొత్తగా టిష్యూ పేపర్ ఉత్పత్తికి అనుమతులు ఇవ్వడమే అందుకు కారణమన్నారు. పేపర్ మిల్లు కాలుష్యంపై నిర్లక్ష్యం వహిస్తున్న బాధ్యులైన అధికారులు, ప్రజాప్రతినిధులపై త్రీ టౌన్ పోలీస్ స్టేషన్లో జూన్ నెలలో చేసిన ఫిర్యాదు పై చర్యలు లేవన్నారు. ఉపముఖ్యమంత్రి పరిశీలనకు, చర్యలకు కుటమి ప్రభుత్వం లో విలువ లేదా ప్రశ్నించారు. గోదావరి పుష్కరాలకు మూడు నెలలు ముందు మిల్లును మూసివేయాలని, వాటర్ పంపిణీని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. గోదావరి పుష్కరాలకు కేంద్ర , రాష్ట్ర, సి ఎస్ ఆర్ నిధులు లభ్యత వ్యయ్యాలపై నగర ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. చారిత్రాత్మక నగరానికి రాజమహేంద్రవరం స్థానంలో రాజమహేంద్రి పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆర్పిసి నాయకులు పెండ్యాల కామరాజు, దుర్గా ప్రసాద్, మాస ప్రసాద్ , దొడ్డి ప్రసాదు, బస సౌమ్య, సాయి, శర్మ తదితరులు పాల్గొన్నారు.

## వినాయక చవితి వేడుకల్లో నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



**సీతానగరం, పెన్ పవర్, సెప్టెంబర్ 9 :**వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సీతానగరం ఎస్సై ఎల్. శ్రీను నాయక్ సూచించారు. పండుగ పేరుతో నిబంధనలు ఉల్లంఘించి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే మాత్రం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వినాయక మండపాలు ఏర్పాటు చేసుకునే నిర్వాహకులు తప్పనిసరిగా ఆన్లైన్లో అనుమతి కోసం స్లాబ్ బుక్ చేసుకోవాలని ఎస్సై సూచించారు. అనుమతు లేకుండా మండపాలు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండపాల వద్ద రాత్రి వేళల్లో కమిటీ సభ్యులు తప్పనిసరిగా చూసుకోవాలన్నారు. వినాయక చవితి వేడుకల్లో డీజీలకు ఎలాంటి అనుమతి లేదని తేల్చి చెప్పారు. డీజే లు ఏర్పాటు చేసి అధిక శబ్దాలతో హంగామా చేయడం చుట్టుపక్కల ప్రజలకు ఇబ్బందులు కలిగించడం చేస్తే ఉపేక్షించబోమన్నారు. రాత్రి 10 గంటలకు తర్వాత లౌడ్ స్పీకర్ వినియోగం పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. పండుగ సందర్భంగా కొందరు యువకులు అత్యుత్సాహం తో వ్యవహరించి శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తించరాదని హెచ్చరించారు. నిబంధనలు అందరికీ ఒకే విధంగా వర్తిస్తాయని ఎవరైనా ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎస్సై ఎల్.శ్రీను నాయక్ స్పష్టం చేశారు. వినాయక చవితిని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.

## పోలీస్ శాఖతో కలిసి ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు రాధిక చారిటబుల్ ట్రస్ట్ చేయూత



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, సెప్టెంబర్ 9:**తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ ని రాధిక చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ రాధికా టంగుటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రజా సేవా కార్యక్రమాల్లో తూర్పుగోదావరి జిల్లా పోలీస్ శాఖతో కలిసి పనిచేసేందుకు రాధిక చారిటబుల్ ట్రస్ట్ ఆసక్తి వ్యక్తం చేసింది. ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపట్టనున్న వివిధ సేవా కార్యక్రమాల వివరాలను ఎస్పీకి వివరించారు. ముఖ్యంగా మహిళలు, బాలల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణ, ట్రాఫిక్ నిబంధనలు--రహదారి భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించడం, విధి నిర్వహణలో నిరంతరం సేవలందిస్తున్న హోంగార్డుల సంక్షేమానికి అవసరమైన సహకారం అందించడంతో పాటు, సమాజ హితం కోసం చేపట్టే ఇతర సేవా కార్యక్రమాలను జిల్లా పోలీస్ శాఖ సమన్వయంతో నిర్వహించేందుకు ట్రస్ట్ సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ డి.నరసింహ కిషోర్ మాట్లాడుతూ.. సమాజ శ్రేయస్సు కోసం స్వచ్ఛంద సంస్థలు పోలీస్ శాఖతో కలిసి పనిచేయడం అభినందనీయమని అన్నారు. ప్రజా భద్రత, చట్టాలపై అవగాహన కల్పించడంతో పాటు మహిళలు, బాలల రక్షణ కోసం చేపట్టే సామాజిక కార్యక్రమాలకు జిల్లా పోలీస్ శాఖ తరపున అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. ప్రజా భద్రత, సంక్షేమం, సామాజిక బాధ్యత వంటి అంశాల్లో పోలీస్ శాఖ--స్వచ్ఛంద సంస్థల సమన్వయం మరింత బలోపేతం కావడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించవచ్చని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## 9వ డివిజన్‌లో రూ.24 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 9:**స్థానిక 9వ డివిజన్‌లో రూ.24 లక్షలతో చేపట్టనున్న సీసీ డ్రైనేజీ, ఆర్సీసీ క్రాస్ కల్వర్టు నిర్మాణ పనులకు సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఎస్ బి ఐ కాలనీ కాంచన నగర్, జైశ్రీ గార్డెన్స్ ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి ఈ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో 9వ డివిజన్‌లో సుమారు రూ.18.50 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేసినట్లు తెలిపారు. పార్కులు, రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. గత ప్రభుత్వం లో అంతర్గత రోడ్లు, డ్రైనేజీలను పట్టించుకోలేదని విమర్శించారు. 9వ డివిజన్‌లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పనులను పరిష్కరిస్తున్నామని చెప్పారు. నగరంలో డ్రైనేజీ వ్యవస్థ ప్రక్షాళనకు పుష్కర నిధుల నుంచి సుమారు రూ.140 కోట్లతో పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. శిథిలావస్థలో ఉన్న డ్రైనేజీలను పునర్నిర్మించి, నగరంలోని డ్రైనేజీ, రహదారి సమస్యలను పరిష్కరించే బాధ్యతను ఎమ్మెల్యేగా తాను తీసుకుంటానని ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. మాజీ కార్పొరేటర్ కోసూరి చండిప్రియ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కొల్లి బుజ్జి, ముసిని బాబూరావు, పెంటపాటి సుభాష్, విశ్వనాథ రాజు, స్థానికులు, నగర పాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

## సారాయి నిందితులు ఇద్దరిపై పీడీ యాక్ట్ అమలు




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 9:**పలు సారాయి కేసుల్లో నిందితులుగా ఉన్న ఇద్దరిపై పీడీ యాక్ట్ అమలు చేసి, రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించినట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి వై. శ్రీలత బుధవారం తెలిపారు. కాకినాడ జోన్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ వై. చైతన్య మురళి ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం నార్త్, సౌత్ స్టేషన్ల పరిధిలో నమోదైన కేసుల ఆధారంగా ఈ చర్యలు తీసుకున్నారు. రూరల్ మండలం వెంకటనగరం గ్రామానికి చెందిన వల్లూరి దుర్గారావు (అలియాస్ పెద్ద దుర్గ), రాజానగరం మండలం శ్రీరాంపురం గ్రామానికి చెందిన చిటికిన నాగేశ్వరరావులపై తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ నిర్బంధ ఉత్తర్వులు జారీ చేయడంతో వారిని అరెస్టు చేసి కేంద్ర కారాగారానికి తరలించారు. జిల్లాలో నాటుసారాయి తయారు చేసినా, రవాణా చేసినా, విక్రయించినా సహించేది లేదని, అటువంటి వారిపై కఠిన చట్టపర చర్యలు తప్పవని హెచ్చరించారు. సారాయి తయారీ, విక్రయాల సమాచారం 14405 టోల్ ఫ్రీ నెంబరుకు సమాచారం అందించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## చింతూరు సాంఘిక సంక్షేమ బాలుర హాస్టల్‌ను సందర్శించిన దళిత కుటుంబ సంక్షేమ సంఘం





**చింతూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 9:**మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర హాస్టల్‌లో వార్డెన్‌పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో దళిత కుటుంబ సంక్షేమ సంఘ నాయకులు, కమిటీ సభ్యులు హాస్టల్‌ను సందర్శించారు. ఇటీవల హాస్టల్‌లో చదువుతున్న 9వ తరగతి విద్యార్థి ముక్కెర జీవన్ బాబు, అతని తమ్ముడు ముక్కెర చరణ్‌కు సంబంధించి డబ్బుల చోరీ వ్యవహారంలో వార్డెన్ గొంతు నొక్కి చంపుతానని బెదిరించారంటూ వచ్చిన వార్తలను సంఘం నాయకులు ఖండించారు. ఈ విషయంపై మంగళవారం సాయంత్రం హాస్టల్‌లోని విద్యార్థులను సంఘం నాయకులు కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల నుంచి సేకరించిన వివరాల ప్రకారం జీవన్ బాబు, చరణ్ గతంలోనూ, ప్రస్తుతం కూడా తమ వద్ద డబ్బులు తీసుకున్నారని విద్యార్థులు తెలిపినట్లు సంఘం నాయకులు పేర్కొన్నారు. అలాగే సంఘటన జరిగిన సమయంలో వార్డెన్ అక్కడ లేరని విద్యార్థులు చెప్పారని, దీంతో వార్డెన్‌పై వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదని సంఘం నాయకులు తెలిపారు. కొంతమంది వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఈ విషయాన్ని పెద్దది చేసి ప్రచారం చేస్తున్నారని వారు ఆరోపించారు. హాస్టల్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు వార్డెన్‌పై గానీ, హాస్టల్ నిర్వహణపై గానీ ఇలాంటి ఆరోపణలు గతంలో రాలేదని సంఘం పేర్కొంది. అయితే విద్యార్థుల భద్రత, సంక్షేమం విషయంలో వార్డెన్ మరింత బాధ్యతగా వ్యవహరించాలని సంఘం నాయకులు సూచించారు. భవిష్యత్తులో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేదా అంతరాయం కలిగినా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు నక్క రజినీకుమార్, ఇంటి సుదర్శన్‌కుమార్, శెట్టి దుర్గారావు, గుబ్బల ఆనంద్‌కుమార్, పట్రా జీవరత్నం, ఎం. సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## మొదటి విడత కౌన్సెలింగ్‌లో 44 మంది విద్యార్థులకు సీట్లు



**పెన్ పవర్ ఉంగుటూరు సెప్టెంబర్ 09:**నారాయణపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2026--27 విద్యా సంవత్సరానికి డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశాల్లో భాగంగా నిర్వహించిన మొదటి విడత కౌన్సెలింగ్‌లో 44 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె. వసుధ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆమె ప్రకటన విడుదల చేశారు. బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో కామన్ అడ్మిషన్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు సీట్లు కేటాయించి, వారికి అలాట్‌మెంట్ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రణాళికా అభివృద్ధి కమిటీ సభ్యుడు, విశ్రాంత పీడీ ఆదిరెడ్డి సత్యనారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

## మంత్రి ఆనంతో కళ్యాణ మండపం ప్రారంభం




**జీలుగుమిల్లి, పెన్ పవర్, సెప్టెంబర్ 9;**శ్రీ ద్వారక తిరుమల చిన్న వెంకన్నను సామాన్య భక్తులకు సైతం మరింత దగ్గర చేసేందుకు స్వామివారి ఉపాలయమైన ఎన్టీఆర్ జిల్లా మైలవరం శ్రీ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో రూ.4.00 కోట్ల వ్యయంతో శ్రీ లక్ష్మీనరసింహ నూతన కళ్యాణ మండపాన్ని ఆలయ చైర్మన్ రాజా సూరనేని వెంకట సుధాకర రావు ఆధ్వర్యంలో రాష్ట్ర దేవాదాయ ,ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తో కలిసి బుధవారం ఘనంగా ప్రారంభించినట్లు, మాజీ జెడ్పిటిసి, జనసేన జిల్లా సీనియర్ నాయకులు, ద్వారకాతిరుమల శ్రీ చిన్న వెంకన్న దేవస్థానం స్టేట్ ట్రస్ట్ బోర్డు ప్రత్యేక ఆహ్వానితులు గడ్డమణుగు రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కళ్యాణ మండపానికి శ్రీశ్రీశ్రీ కొచ్చర్లపాటి నరసింహం గురువు సూచన మేరకు శ్రీ లక్ష్మీనరసింహ కళ్యాణ మండపంగా పేరు పెట్టడం జరిగిందన్నారు. దేవస్థానం ట్రస్ట్ బోర్డు ఏర్పడక ద్వారకాతిరుమలలో భక్తుల సౌకర్యార్థం రూ.50.00 కోట్లుతో క్యూ- కాంప్లెక్స్, తూర్పు గోపురం, అనివెట్టి మండపం (వివాహాలు, అన్నప్రాసనలకు) తదితర అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. మరో దత్తత ఆలయమైన ఐఎస్ జగన్నాథపురం శ్రీ లక్ష్మీనరసింహ ఆలయంలో ఈనెల 19వ తేదీ వరకు పవిత్రోత్సవాలు, వరుణ యాగం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఆలయానికి శ్రీశ్రీశ్రీ కొచ్చర్లపాటి నరసింహం గురువు ఆధ్వర్యంలో మునుముందు మహర్దశ పట్టణం ఉందని రవికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్, అనువంశిక ధర్మకర్త సురానేని వెంకట నారాయణ నివృత్ రావు, ట్రస్ట్ బోర్డ్ సభ్యులు పాల్గొన్నారు.

# సిపిఐ లో 50 మంది చేరిక




**జీలుగుమిల్లి, పెన్ పవర్, సెప్టెంబర్ 9;** ప్రజల కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం, పార్టీ సిద్ధాంతాలు నచ్చి 50 మంది సిపిఐ లో చేరారని ఏలూరు జిల్లా సిపిఐ కార్యదర్శి కృష్ణ చైతన్య తెలిపారు. బుధవారం ములగలంపల్లి పంచాయతీ పరిధిలో పాకల గూడెం గ్రామానికి చెందిన సుమారు 50 మంది సిపిఐ లో చేరారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు పోడు భూములు సాగు చేసుకోవడానికి సిపిఐ పార్టీ పోరాటం చేస్తుందని అన్నారు. వి ఎస్ ఎస్ పునరుద్దించి గిరిజన లకు జీవనోపాధి కల్పించడానికి కృషి చేస్తుందని అన్నారు. సిపిఐ పార్టీ ప్రజల కోసం పనిచేసే పార్టీ అని అన్నారు. సవలం వెంకటేశ్వరరావు, కురసం వీరభద్రం, మట్ట అక్కమ్మ, చేప నాగమణి, కట్టం లీలావతి, శాప నాగు, సవలం అక్కమ్మ, కొవ్వాసి శ్రీను, తామ మహేష్,, తమ విజయ్, తామ ముత్యాలరావు చేరిన వారిలో ముఖ్యులు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కారం ధారయ, జిల్లా నాయకులు కొప్పుల నాగరాజు పాల్గొన్నారు.

## ధరలు నియంత్రించాలని ఎమ్మార్వో కి వినతి పత్రం



**జీలుగుమిల్లి, పెన్ పవర్, సెప్టెంబర్ 9;** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యవసర వస్తువులు ధరలు తగ్గిస్తామని ఇచ్చిన హామీ ఆచరణకు నోచుకోక విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వాలు నిమ్మకు నీరు ఎత్తినట్లు వ్యవహరిస్తున్నాయని ఏలూరు జిల్లా సిపిఐ కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అన్నారు. బుధవారం తాసిల్దారు జి వెంకటేశ్వరరావు కి నిత్యవసర వస్తువులు ధరలు నియంత్రించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఐ రాష్ట్ర సమితి పిలుపుమేరకు నిత్యావసర వస్తువులు ధరలు తగ్గించాలని అన్నారు. 16 రకాల నిత్యావసర వస్తువులు ధరలు పెరగడంతో పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. నిత్యవసర సరుకులు ధరలు అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని, 16 రకాల నిత్యావసర వస్తువులను ప్రజలకు పంపిణీ చేయాలని, గ్యాస్, పెట్రోల్ ,డీజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల సిపిఐ కార్యదర్శి కారం ధారయ్య, జిల్లా నాయకులు కొప్పుల నాగరాజు, కోక్కిరిగడ్డ ఆనందరావు, సవ్వలం వెంకటేష్, కొవ్వాసి శ్రీను, చాప నాగు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికీ కూటమి పాలన.. నిజం గెలిచింది

- శాసనసభ్యులు పితాని సత్యనారాయణ.



**పెనుగొండ పెన్ పవర్ సెప్టెంబర్ 09:**పశ్చిమగోదావరి జిల్లా ఆచంట నియోజవర్గంలోని పెనుగొండ గ్రామంలో బుధవారం ఇంటింటికిమన పీతాని కార్యక్రమంలో భాగంగా శాసనసభ్యులు పేర్తాన్ని పర్యటించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు పితాని సత్యనారాయణ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అరెస్టు విషయంలో చివరకు నిజమే గెలిచిందని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. చంద్రబాబును అరెస్టు చేసి 53 రోజుల పాటు జైల్లో ఉంచి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా.. పెనుగొండ గాంధీ బొమ్మ సెంటర్‌లో 'నిజం గెలిచింది' కార్యక్రమంనిర్వహించనున్నట్లు తెలిపారు.మరోవైపు కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా.. టీడీపీ శ్రేణులు పెనుగొండ మండలంరామచంద్రరావు
పేట, చాకలిపేట ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలుఅందుతున్నాయా సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పితాని సత్యనారాయణ మాట్లాడుతూ.. చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం వంటి పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు.అర్హులైన వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు పింఛన్లు అందిస్తున్నామని.. కొత్తగా అర్హత పొందిన వారికి కూడా పింఛన్లు మంజూరు చేస్తున్నామని చెప్పారు. పార్టీ, ఓటు చూడకుండా.. అర్హతే ప్రామాణికంగా సంక్షేమం అందిస్తున్నామని స్పష్టం చేశారు.

పెనుగొండ లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. రెండేళ్ల కూటమి పాలనలో అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరిస్తూ టీడీపీ శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెనుగొండ ఏఎంసీ చైర్మన్ బడేటి బ్రహ్మాజీ, పెనుగొండ కోపరేటివ్ సొసైటీ చైర్మన్ నక్క వ్యాద వ్యాసా శాస్త్రి, మాజీ సర్పంచ్ నక్క శ్యామల సోని శాస్త్రి, టౌన్ టిడిపి అధ్యక్షులు రొక్కాల సురేష్, టిడిపి నాయకులు మండ ప్రసాద్, మండల టిడిపి అధ్యక్షులు గుత్తుల లోకేష్, మహిళా కార్యకర్తలు టిడిపి నాయకులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నిత్యావసర సరుకులు సక్రమంగా అందించాలి




### సివిల్ సప్లై అధికారులకు జేసీ ఎస్. ప్రశాంత్‌కుమార్ ఆదేశం

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 9:**పోలవరం జిల్లాలో ప్రజలకు నిత్యావసర సరుకులు సక్రమంగా, సకాలంలో అందేలా పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్‌కుమార్ సివిల్ సప్లై అధికారులను ఆదేశించారు.బుధవారం రంపచోడవరంలోని ఐటీడీఏ సమావేశ మందిరంలో సివిల్ సప్లై శాఖ అధికారులతో జాయింట్ కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ సరుకుల పంపిణీ, రేషన్ కార్డుల పరిస్థితి, చౌకధరల దుకాణాల నిర్వహణ, నిత్యావసర సరుకుల నిల్వలు తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు.ప్రజా పంపిణీ వ్యవస్థలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా సరుకులు పంపిణీ చేయాలని జేసీ సూచించారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వం అందిస్తున్న రేషన్ సరుకులు సకాలంలో అందేలా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.చౌకధరల దుకాణాలను క్రమం తప్పకుండా తనిఖీ చేసి స్టాక్ వివరాలు, సరుకుల పంపిణీ విధానాన్ని పరిశీలించాలని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై ప్రభుత్వ నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.జిల్లాలో ఉన్న రైస్ గోడౌన్లు, ఎంఎల్ఎస్ పాయింట్లు, జీసీసీ డీఆర్ డిపోలు, రేషన్ లబ్ధిదారుల సంఖ్య, పెట్రోల్ బంకులు, గ్యాస్ డీలర్ షాపుల వివరాలను జేసీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎంఎల్ఎస్ పాయింట్లలో ఎప్పటికప్పుడు తగినంత రేషన్, నిత్యావసర సరుకుల నిల్వలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.రేషన్ షాపుల ద్వారా ప్రభుత్వ నిబంధనల ప్రకారం లబ్ధిదారులకు సరుకులు అందించాలని, గ్యాస్ బుక్ చేసుకున్న వినియోగదారులకు నిబంధనల మేరకు సకాలంలో గ్యాస్ సరఫరా జరిగేలా చూడాలని ఆదేశించారు. సివిల్ సప్లై శాఖకు సంబంధించిన అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని తెలిపారు.సివిల్ సప్లై శాఖకు సంబంధించిన సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని జేసీ అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో జిల్లా సివిల్ సప్లై అధికారి రాజేశ్వరి, జీసీసీ డీఎం జయశ్రీ, జీసీసీ మేనేజర్లు బేబీ రాణి, అమ్ములు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, గోడౌన్ ఇన్‌చార్జులు, గ్యాస్ సరఫరా ఇన్‌చార్జులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాజమండ్రిప్రభుత్వమెడికల్ కాలేజీలో నీట్ తొలి దశలో ఎంబిబిఎస్ సీటు సాధించిన.

**యార్లగడ్డ ప్రశాంత్ బాబు.**



**పెనుమంట్ర పెన్ పవర్ సెప్టెంబర్ 9** :పశ్చిమగోదావరి జిల్లా ఆచంట నియోజవర్గం పెనుమంట్ర మండలం నత్తా రమేష్ ఎస్సీమాదిగ కాలనీకి చెందినయార్లగడ్డబాబు (భార్య) వెంకటలక్ష్మి దంపతుల కుమారుడు ప్రశాంత్ బాబు,ప్రశాంత్ బాబుతండ్రితాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రిలో ఐసీటీసీ కౌన్సిలర్ గా పని చేస్తున్నారు. తల్లి సచివాలయంలో ఏఎన్ఎం గా పనిచేస్తున్నారు ప్రశాంత్ బాబు ని చిన్నప్పటి నుంచి క్రమశిక్షణతో పెంచి చదివించారు. పెనుమంట్ర గవర్నమెంట్ హై స్కూల్లో మండల స్థాయిలో పదవ తరగతి సెకండ్ క్లాస్ లో పాస్ అయ్యి, ఇంటర్ బైపీసీలో తణుకు శశి కాలేజీలో మొదటి స్థానం సంపాదించుకున్నాడు. చదువుతూ ఎస్సి సెకండ్ కోటాలో నీ తొలి దశ కౌన్సిలింగ్ లోనే సీటుసంపాదించుకున్నాడు. జాతీయస్థాయిలో 1,40, 727 ర్యాంకు ఎస్సీ కేటగిరి 857.ర్యాంకు,తెచ్చుకున్నాడు,రాజమండ్రి ప్రభుత్వ మెడికల్ కాలేజీలో నీట్ తొలి దశ కౌన్సిలింగ్ లోనే ఎంబిబిఎస్ సీటు సాధించడం పట్ల . తల్లిదండ్రులు తమ కుమారుడి పట్ల ఆనంద వ్యక్తంచేసిమాట్లాడుతూ మా బిడ్డసమాజంలో ఒక వ్యక్తిగా ఒక శక్తిగా సమాజశీలో పదిమందికి సాయపడే వ్యక్తిగా బిడ్డ ఎదగాలని అందరికీ ఆదర్శంగా ఉండాలని తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

## ఉల్లాస్--అక్షర ఆంధ్ర అభ్యాస కేంద్రాలు తక్షణమే ప్రారంభించాలి



- మార్చి 2027 పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యం
- అధికారులను ఆదేశించిన కలెక్టర్ కె. దినేష్‌కుమార్

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 9:**2027 మార్చిలో నిర్వహించే ఉల్లాస్--అక్షర ఆంధ్ర పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని పోలవరం జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ కె. దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఉల్లాస్--అక్షర ఆంధ్ర కార్యక్రమం కింద గుర్తించిన నిరక్షరాస్య అభ్యాసకులు, స్వచ్ఛంద ఉపాధ్యాయుల (వీటీలు) మ్యాపింగ్ పూర్తయిన నేపథ్యంలో అభ్యాస కేంద్రాలను తక్షణమే ప్రారంభించాలని సూచించారు. ప్రతిరోజూ ఒకటి నుంచి గంటన్నర పాటు తరగతులు నిర్వహిస్తూ, అభ్యాసకులకు నాణ్యమైన బోధన అందించాలని ఆదేశించారు.దేవీపట్నం, గంగవరం, మారేడుమిల్లి, చింతూరు, కూనవరం, వీఆర్ పురం, ఏటపాక మండలాల్లో కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను అభ్యాస కేంద్రాలుగా వినియోగించుకోవాలని, కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, కూర్చునే సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అభ్యాసకుల 100 శాతం హాజరుపై ప్రత్యేక దృష్టి సారించాలని పీడీ--డీడబ్ల్యూఎంఏ, పీడీ--డీఆర్‌డీఏ క్షేత్రస్థాయి సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని స్పష్టం చేశారు.జిల్లా అక్షర ఆంధ్రా నోడల్ అధికారి వి. త్రిమూర్తులు అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ అభ్యాస కేంద్రాల నిర్వహణ, అభ్యాసకుల హాజరు, బోధనా కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమ పురోగతిపై ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని ఆదేశించారు.

## తాగునీటి సరఫరా వ్యవస్థను మెరుగుపర్చాలి



### కమిషనర్ రాహుల్ మీనా

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 9:**నగరంలో తాగునీటి సరఫరా వ్యవస్థను మరింత మెరుగుపర్చాలని కమిషనర్ రాహుల్ మీనా సూచించారు. బుధవారం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. సీవీ మార్కెట్ పంప్ హౌస్ నందు రూ. 37 లక్షలతో చేపట్టిన హెడ్ వాటర్ వర్క్స్, ఫిల్టర్ ప్లాంట్ పెయింటింగ్, పాత్ వే డెవలప్మెంట్ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నిర్వహణ విధానం, ఫిల్టరైజేషన్ ప్లాంట్ల పని తీరు, నీటి సేకరణ శుద్ధి చేయు విధానం, ల్యాబ్ నందు వాటర్ టెస్టింగ్, క్లోరినేషన్ ఎంత పరిమాణంలో కలుపుతున్నది అధికారులను అడిగి తెలుసుకొన్నారు. ట్యాంకర్లను శుభ్రపరచు కుంటూ ఉండాలని.. ప్రతిరోజు నీటి పరీక్షలు ఖచ్చితంగా నిర్వహించా లని సూచించారు. నగరంలో లీకేజీ సమస్యలు లేకుండా, నీరు కలుషితం కాకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని ఆదేశించారు. ప్రతి ఇంటికి శు ద్ధమైన త్రాగునీరు సరఫరా అవుతుందా లేదా. అని ఎమినిటీ సెక్రటరీలు ప్రతిరోజు క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. ఆయన వెంట ఎస్ఈ రీటా, ఈఈ మాధవి, డీఈ సత్యనారాయణ, ఏఈ వెంకటేష్, ఇతర సిబ్బంది ఉన్నారు.

## ఆత్మహత్యల నివారణపై విద్యార్థులకు అవగాహన




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 9:** ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తూర్పుగోదావరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం ఆధ్వర్యంలో ఎస్ కే ఆర్ డిగ్రీ , పీజీ మహిళా కళాశాల విద్యార్థులకు ఆత్మహత్యల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆత్మహత్యలు, ఆత్మహత్యా యత్నాలకు దారితీసే కారణాలు, ఆలోచనలు , ప్రవర్తనను ముందుగానే గుర్తించేందుకు కనిపించే హెచ్చరిక సంకేతాలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆపదలో ఉన్న వ్యక్తులను నిర్లక్ష్యం చేయకుండా వారితో సానుభూతితో మాట్లాడటం, వారికి మద్దతుగా నిలవడం, వారి సమస్యలను వినడం, మానసిక వైద్యులు లేదా సైకాలజిస్టులను సకాలంలో సంప్రదించేలా చూడటం, సహాయం అందించవచ్చని వివరించారు.ఈ ఏడాది ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం థీమ్ ఆత్మహత్యలపై ఆలోచనా విధానాన్ని మార్చడం కాగా, అనే పిలుపుతో ఆత్మహత్యలపై మౌనం వీడి, అవసరమైన సమయంలో బాధలో ఉన్న వారితో మాట్లాడి వారికి అండగా నిలవాలని సూచించారు. మానసిక సమస్యలు, తీవ్రమైన ఒత్తిడి లేదా ఆత్మహత్య ఆలోచనలు ఎదుర్కొంటు న్న వారు తక్షణ మానసిక ఆరోగ్య సహాయం పొందేందుకు టెలి మానస్సాస్ టోల్‌ఫ్రీ నంబర్ 14416ను సంప్రదించవచ్చని విద్యార్థులకు తెలియజేశారు. ఈ సందేశాన్ని విస్తృతంగా ప్రచారం చేసేందుకు కార్యక్రమంలో 14416కు సంబంధించిన అవగాహన బ్యానర్లను ప్రదర్శించారు.కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. కోమల, జిల్లా ప్రోగ్రామ్ మేనేజ్‌మెంట్ ఆఫీసర్ డా. శ్రీవల్లి, సైకియాట్రిస్ట్ డా. అఖిలేంద్ర శ్రీనివాస్ తో పాటు వైద్య సిబ్బంది పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. "ఆత్మహత్యల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత. మన చుట్టూ ఉన్నవారితో మాట్లాడటం, వారి మాట వినడం, అవసరమైన సమయంలో సహాయం అందించడం ద్వారా ఒక ప్రాణాన్ని కాపాడవచ్చు" అని సందేశాన్ని అందించారు.

# జిల్లా పోలీస్ అధికారులతో అర్ధ వార్షిక నేర సమీక్షా సమావేశం






- పోలీసుల పనితీరుపై ప్రజల్లో సానుకూల అభిప్రాయం కలిగేలా చర్యలు చేపట్టాలి
- ఎస్పీ డి.నరసింహ కిషోర్

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, సెప్టెంబర్ 9:** తూర్పుగోదావరి జిల్లా పోలీసు కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలోని ఎస్సై, ఆపై స్థాయి పోలీసు అధికారులతో అర్ధ వార్షిక నేర సమీక్షా సమావేశం నిర్వహించిన జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్. జిల్లాలో నమోదైన గ్రేవ్, నాన్ గ్రేవ్, అస్తి సంబంధిత నేరాలు, ఇతర కేసుల నమోదు, చేధనల గురించి పోలీస్ స్టేషన్ వారీగా పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ పలు సూచనలు చేయడం జరిగింది. మహిళల భద్రతకు ప్రాధాన్యత నిచ్చి వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, పోలీసు స్టేషన్లకు వచ్చే ప్రజల పట్ల మర్యాద పూర్వకంగా వ్యవహరించి వారి సమస్యలకు చట్టపరిధిలో పరిష్కారం చూపాలని తెలిపారు. మాదక ద్రవ్యాల అనర్ధాలపై విద్యార్థులు, ప్రజల్లో విరివిగా అవగాహన చేయమని చెప్పారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించాలని, ఇతర ప్రభుత్వ విభాగాలతో కలసి బ్లాక్ స్పాట్స్ సందర్శించి తగు చర్యలు తీసుకోవాలని, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయమని, రోడ్డు భద్రతా నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. రాంగ్ రూట్, ఓవర్లోడ్, ట్రిపుల్ రైడ్, హెల్మెట్ లేకుండా, రోడ్డు నిబంధనలు పాటించని వాహనదారులపై ఈ-చలాన్ల ద్వారా జరిమానాలు విధించాలని ఆదేశాలు జారీ చేశారు. కేసుల ఛేదింపునకు, పరిష్కారానికి, నేర నియంత్రణకు దోహదం చేసే పలు సూచనలు, మెళకువలను అధికారులకు దిశా నిర్దేశాలు చేశారు. మాదక ద్రవ్యాల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యార్థులు, యువత, ప్రజల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. విజిబుల్ పోలీసింగ్ పెంచాలని, తద్వారా నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణలు సులువవుతాయని సూచనలు ఇచ్చారు. పెండింగ్ గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులు, హత్య, పోక్సో, రేప్, డెకాయిటీ, రాబరీ, ప్రాపర్టీ, వాహనాల దొంగతనం, మిస్సింగ్, చీటింగ్, రోడ్డు ప్రమాదాలు వంటి వాటిపై సర్కిల్ వారీగా సమీక్ష నిర్వహించి తగు సూచనలు చేశారు. కేసుల దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేసి, నిర్ణీత గడువులో చార్జిషీట్లను కోర్టులో దాఖలు చేయాలని అన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అధికారులు ప్రణాళికాబద్ధంగా ముందస్తు చర్యలు చేపట్టి సంసిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన స్మార్ట్ పోలీసింగ్ వ్యవస్థను జిల్లా పోలీసు అధికారులు సమర్ధవంతంగా వినియోగించి, కేసుల దర్యాప్తును వేగవంతం చేయడంతో పాటు స్మార్ట్ పోలీసింగ్ ర్యాంకింగ్స్‌లో జిల్లా అగ్రస్థానంలో నిలిచేలా కృషి చేయాలిని తెలిపారు. పోలీస్ పర్సెప్షన్ ఇండెక్స్‌లో జిల్లా ర్యాంకింగ్‌ను మెరుగుపరిచే విధంగా ప్రజలతో సత్సంబంధాలు పెంపొందిస్తూ, పోలీసుల పనితీరుపై ప్రజల్లో సానుకూల అభిప్రాయం కలిగేలా చర్యలు చేపట్టాలని తెలియజేశారు. రాబోయే గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా అవసరమైన భద్రతా ఏర్పాట్లు, సమన్వయ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచి, కేసుల దర్యాప్తు, చేధనలో సమర్ధవంతంగా పనిచేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని అభినందిస్తూ ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేసినారు. ఆంధ్రప్రదేశ్ పోలీస్ మీట్‌లో జిల్లా తరపున పాల్గొని పతకాలు సాధించిన పోలీస్ క్రీడాకారులను ఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ(అడ్మిన్) పాటిల్ దేవరాజ్ మనీష్, డీఎస్పీలు, ఇన్స్పెక్టర్లు, ఎస్సైలు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



## జియోసైన్సెస్ విద్యార్థిని నాగబత్తుల సునందకు పీహెచ్.డి. ప్రదానం



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 9:** ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, జియోసైన్సెస్ విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థిని నాగబత్తుల సునంద పీహెచ్.డి. పూర్తి చేశారు. ఈ సందర్భంగా విశ్వ విద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ సునందకు పీహెచ్.డి. అవార్డును ప్రదానం చేశారు. సునంద ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం జియో సైన్సెస్ విభాగంలో ఫుల్‌టైమ్ స్కాలర్‌గా పరిశోధన చేపట్టారు. "తూర్పు గోదావరి జిల్లా, బురద కాలువ నదీ పరీవాహక ప్రాంతంలో భూగర్భ జల వనరుల సుస్థిర నిర్వహణ కొరకు సమీకృత అధ్యయనాలు" అనే అంశంపై ఆమె పరిశోధన పూర్తి చేశారు. ఆమె పరిశోధనకు డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ సైన్సెస్, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ ఆచార్య వై. శ్రీనివాసరావు మార్గదర్శకత్వం వహించారు. పీహెచ్.డి. సాధించిన నాగబత్తుల సునందను ఉపకులపతి ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య కె. రమణేశ్వరి, ప్రిన్సిపల్ ఆచార్య డి. కల్యాణి, గైడ్ ఆచార్య వై. శ్రీనివాసరావు, జియోసైన్సెస్ విభాగ అధ్యాపకులు అభినందిం చారు.

## తూర్పు పాలెం వైసీపీ క్యాంప్ కార్యాలయంలో వైసిపి విస్తృతస్థాయి సమావేశం..


నియోజకవర్గ ఇన్చార్జ్ చెరుకువాడ శ్రీరంగనాథరాజు.




**పోడూరు పెన్ పవర్ సెప్టెంబర్ 9:** పోడూరు మండలం తూర్పుపాలెం వైఎస్ఆర్సీపీ కార్యాలయం లో ఆచంట ఇంచార్జ్ రంగనాథ రాజు ఆధ్వర్యం లో బుధవారం వైస్సార్సీపీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగరాజు మాట్లాడుతూ, 2011 నుంచి ఎన్నో ఆటుపోట్లకి ఎదురోడ్డి నిలబడిన పార్టీ వైసీపీ అని వెల్లడించారు. కార్యక్రమం లో ఆచంట నియోజక పరిశీలకులు షర్మిల రెడ్డి, నరసాపురం పార్లమెంట్ ఇంచార్జ్ ఉమాబాల యువనాయకులు చెరుకువాడ నరేష్ రాజు జడ్పీటీసీ పెద్దిరాజు, సుభాషిణి, ఎంపీపీ వాసు రెడ్డి, పుత్తినీడి వెంకటేశ్వర్లు, సబ్బితి సుమంగలి, మండల కన్వీనర్ లు గూడూరు దేవేంద్రుడు, జె శ్రీరాములు, బాబిరెడ్డి,, మాజీ సర్పంచ్ లు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు పార్టీ గ్రామ అధ్యక్షులు, యువజన సంఘం సభ్యులు ఆచంట నియోజకవర్గం లోని వివిధ హోదాలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు కార్యక్రమ అనంతరం రాష్ట్ర జిల్లా నియోజకవర్గ అనుబంధ కమిటీల నాయకులకు ఐడెంటి కార్డులు జారీ చేయడం జరిగింది.

## కూనవరం పంచాయతీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం...

- డిప్యూటీ ఎంపీడీవో కు ఎచ్చు రవి వినతి పత్రం



**కూనవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 9.** కూనవరం మేజర్ పంచాయతీలో ని సమస్యలను పరిష్కరించాలని గ్రామ శాఖ అధ్యక్షులు ఎచ్చు రవి స్పెషల్ అధికారి జగన్నాథ రావు కి వినతిపత్రం అందజేశారు. కూనవ రం-టేకులబోరు డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని తక్షణం సమస్యను పరిష్కరిం చాలని డిప్యూటీ ఎంపీడీవోను కోరారు. కూనవరం పాత తాసిల్దార్ కార్యాల యం నుండి శివాలయం రోడ్డు వర కు, పంచాయతీ నుండి హైస్కూల్ సెంటర్ వరకు డ్రైనేజీ సమస్యలు న్నాయని తెలిపారు. కూనవరం సాయిబాబా గుడి వద్ద రోడ్డు గుంత లు, ప్రభుత్వ జూనియర్ కాలేజీ వద్ద పబ్లిక్ టాయిలెట్ ఏర్పాటు చేయా లని కోరారు. టేకులబోరు ఎస్సీ కాలనీ వీధులు మురికి నీరు ఎటు పోకుండా నిలిచి పోతుందని, దోమ లు బెడద విపరీ తంగా ఉందని తక్ష ణం పరిష్కరించాలని కోరారు. డిప్యూటీ ఎంపీడీవో అన్ని సమస్య లను వెంటనే పరిష్కరిస్తాన న్నారని ప్రకటన ద్వారా తెలిపారు.

## పెన్షన్‌పై వైసీపీకి మాట్లాడే హక్కు లేదు.

- ఐదేళ్లు మోసం చేసి.. ఇప్పుడు మొసలి కన్నీళ్లా?.. జనసేన నాయకుడు ఆలీ
- కూటమి సంక్షేమాన్ని చూసి ఓర్వలేకే వైసీపీ నేతల విమర్శలు.



**పెనుమంట్ర పెన్ పవర్ సెప్టెంబర్ 09:** ఐదేళ్ల పాలనలో పెన్షన్ పెంచుతామని హామీ ఇచ్చి ప్రజలను మోసం చేసిన వైసీపీ నాయకులు.. ఇప్పుడు కూటమి ప్రభుత్వం పెన్షన్లను పెంచి, అర్హులందరికీ కొత్త పెన్షన్లు అందిస్తుంటే విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని జనసేన నాయకుడు ఆలీ మండిపడ్డారు. "అప్పుడు హామీలు.. ఇప్పుడు విమర్శలా?" అంటూ వైసీపీ నేతలను ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఎన్నికల హామీని అమలు చేసి పెన్షన్‌ను రూ. 1,000 పెంచారని తెలిపారు. అంతేకాకుండా ప్రతి నెల ఒకటో తేదీనే లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి పెన్షన్ అందిస్తున్నారని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందించాలనే లక్ష్యంతో గత ఏడాది నుంచే సచివాలయాల్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారని ఆలీ తెలిపారు. ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ పీజీఆర్ఎస్, ప్రజా సమస్యల వేదిక తదితర కార్యక్రమాల్లో పార్టీలు చూడకుండా అర్హులైన వారి దరఖాస్తులను స్వీకరించి సమస్యలు పరిష్కరించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని పేర్కొన్నారు. "ప్రజలు ఎవరి పాలనలో సంక్షేమం చూశారో.. ఎవరి పాలనలో మోసపోయారో తెలుసునని . ప్రజల తీర్పుతో బుద్ధి రాలేదా?" అని ఆలీ ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వానికి వస్తున్న ప్రజాదరణను చూసి వైసీపీ నేతలు ఓర్వలేక అసహనంతోనే అర్థంపర్థంలేని విమర్శలు చేస్తున్నారనిదుయ్యబట్టారు. ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని.. విమర్శలకు సమాధానం స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రజలే వైసీపీకి బుద్ధి చెబుతారని ఆలీ స్పష్టం చేశారు.

## రోడ్లపైకి పశువులను వదిలితే కఠిన చర్యలు - కమిషనర్ ఎమ్. యేసుబాబు హెచ్చరిక



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. సెప్టెంబర్ 09** తాడేపల్లిగూడెం పట్టణంలో ప్రధాన రహదారులు, అంతర్గత రోడ్లపై ఆవులు, పశు వులను యజమానులు వదిలేయడం వలన ట్రాఫిక్ కు అంతరాయం, ప్రజలకు, వాహనదారులకు తీవ్ర ఇబ్బంది కలుగుతున్నది. ఈ నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ శ ఎమ్. యేసుబాబు కఠిన హెచ్చరిక జారీ చేశారు. 1. రోడ్లపై పశు వులను వదిలిన యజమానులు వెంటనే తమ పశువులను తీసుకువెళ్లాలి. 2. రోడ్లపై కనిపించే పశువులను పట్టుకొని గోసంరక్షణ శాలకు తరలిస్తామని తెలిపారు. 3. రోడ్లపై పశువులను వదిలేసిన యజమానులపై లికేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు, రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ప్రజలు, పశువుల యజమానులు సహకరించాలని కమిషనర్ కోరారు.

## పోషణ్ మాసోత్సవాలకు శ్రీకారం

తల్లులు, చిన్నారులు, గర్భిణులు, బాలింతల్లో పోషకాహారంపై అవగాహన





**గంగవరం, పెన్ పవర్ సెప్టెంబర్ 9:** "మన అంగన్‌వాడీ--మన బాధ్యత" నినాదంతో గంగవరం ప్రాజెక్టు పరిధిలో పోషణ్ మాసం--2026 కార్యక్రమాలకు బుధవారం శ్రీకారం చుట్టారు. మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో వెబ్‌కాస్ట్ ద్వారా కార్యక్రమాన్ని ప్రారంభించారు. సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు నెల రోజులపాటు పోషణ్ మాసోత్సవాలను నిర్వహించనున్నారు.
"ఆరోగ్యకరమైన బిడ్డలు--అభివృద్ధి చెందిన ఆంధ్రప్రదేశ్--బలమైన సమాజం" లక్ష్యంగా ఐదు వారాలపాటు వివిధ అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు సీడీపీవో సుచరిత ఆదిలక్ష్మి తెలిపారు. తల్లులు, చిన్నారులు, గర్భిణులు, బాలింతల్లో పోషకాహారం, ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. ఆహార వైవిధ్యం, స్థానికంగా లభించే పోషకాహార వనరుల వినియోగం, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలు, తల్లీబిడ్డల ఆరోగ్యం, శిశువుల మానసిక, శారీరక వికాసం, తొలి 1,000 రోజుల ప్రాధాన్యత తదితర అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ప్రధానమంత్రి మాతృ వందన యోజనతో పాటు వివిధ సంక్షేమ పథకాలపై అర్హులైన లబ్ధిదారులకు అవగాహన కల్పించి, శతశాతం నమోదు జరిగేలా చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు. పోషకాహారం, ఆరోగ్య సంరక్షణలో కుటుంబాలు, సమాజ భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు అంగన్‌వాడీ సిబ్బంది ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కుమారి, చిన్న సీతతో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని జనసేన పార్టీ నిర్వహించిన అవగాహన కార్యక్రమం

**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. సెప్టెంబర్ 09.**రాబోయే స్థానిక సంస్థల






ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని జనసేన పార్టీ నిర్వహించిన అవగాహన కార్యక్రమం గుంటూరు జిల్లా తాడేపల్లిలోని అన్నపూర్ణ కన్వెన్షన్‌లో విజయవంతంగా జరిగింది. ఈ సమావేశంలో తాడేపల్లిగూడెం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే జనసేన పార్టీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, రాష్ట్రవ్యాప్తంగా అన్ని పార్లమెంట్ నియోజకవర్గాలకు చెందిన స్థానిక సంస్థల ఎన్నికల కోఆర్డినేటర్లు, కోఆర్డినేషన్ టీమ్ సభ్యులు, సపోర్ట్ టీమ్ సభ్యులు హాజరయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలు, క్షేత్రస్థాయిలో సమన్వయం, ఎన్నికల నిర్వహణ, పార్టీ శ్రేణులను మరింత సమర్థంగా సన్నద్ధం చేసే కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు.

## అడ్డతీగల ఇంచార్జ్ ఎంఈఓ గా వై .మల్లేశ్వరరావు..



**అడ్డతీగల, పెన్ పవర్, సెప్టెంబర్ 09;** అడ్డతీగల ఇంచార్జ్ ఎంఈఓ.1 గా బుధవారం వై. మల్లేశ్వరరావు బాధ్యతల స్వీకరించారు. గతంలో ఈయన అడ్డతీగల ఎంఈఓగా పని చేశారు. ప్రస్తుతం రంపచోడవరం డిఈఓ గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అడ్డతీగల ఎంఈఓ రమేష్ ఇటీవల కాలంలో సెలవుపై వెళ్లడంతో ప్రభుత్వ ఆదేశాలతో ఇంచార్జ్ గా బుధవారం నుండి మల్లేశ్వరరావు బాధ్యత స్వీకరించారు.

## ఆనాటి చంద్రబాబు అక్రమ అరెస్టు కు నిరసనగా కొవ్వొత్తులతో ప్రదర్శన




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 9:**దేశ రాజకీయ చరిత్రలో సెప్టెంబర్ 9 చీకటి రోజని, తెలుగుదేశం పార్టీ ఎప్పటికీ మర్చిపోలేని రోజని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని గత వైసీపీ ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసి 53 రోజుల పాటు జైలులో ఉంచిందని ఆయన మండిపడ్డారు. తిలక్ రోడ్డులోని నగర టీడీపీ కార్యాలయం వద్ద నిర్వహించిన 'నిజం గెలిచింది' కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ శ్రేణులు, మహిళలు కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే వాసు మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు నాయుడిని ఎదుర్కొనే రాజకీయ శక్తి లేకనే గత ప్రభుత్వం తప్పుడు స్కిల్ డెవలప్‌మెంట్ కేసును తెరపైకి తెచ్చి కక్ష సాధింపు చర్యలకు పాల్పడిందని ఆరోపించారు. తొలుత రూ.3 వేల కోట్లని, ఆ తర్వాత రూ.300 కోట్లు, రూ.30 కోట్లుగా మాట మార్చారని విమర్శించారు. చివరకు అవినీతి జరగలేదని న్యాయ స్థానాలు స్పష్టం చేశాయన్నారు. ఒక విజనరీ నాయకుడిని ప్రిజనరీ నాయకుడు అన్యాయంగా అరెస్టు చేస్తే ప్రజలు 2024 లో 11 సీట్లకు పరిమితం చేసి ప్రజలు బుద్ధి చెప్పారని ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. చంద్రబాబు అరెస్టు జరిగిన సెప్టెంబర్ 9 తో పాటు అక్టోబర్ 31న జరిగిన పరిణామాలను కూడా టీడీపీ ప్రతి ఏడాది గుర్తు చేసుకుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, ఆదిరెడ్డి వీర రాఘవమ్మ, కుడుపూడి సత్తిబాబు, యర్రా వేణుగోపాల రాయుడు, కాశీ నవీన్‌కుమార్, వర్రే శ్రీనివాసరావు, ల బుడ్డిగ రవి, 42 డివిజన్లకు చెందిన కమిటీ సభ్యులు, మహిళలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యాశాఖను కించపరచినందుకు చర్యలు తీసుకోవాలి: ఎంఈఓ స్వామి నాయక్



**సీతానగరం, పెన్ పవర్, సెప్టెంబర్ 9** :మండల విద్యాశాఖ అధికారిపై నిరాధారణ ఆరోపణలు చేస్తూ ఒక పత్రిక లో వచ్చిన వార్త మండల విద్యాశాఖ అధికారి కే. స్వామి నాయక్ తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బుధవారం నాడు మండల ఎంఈఓ 1 స్వామి నాయక్ ఆధ్వర్యంలో ప్రైవేటు ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కలిసి మండల ప్రజా పరిషత్, రెవెన్యూ, పోలీస్ స్టేషన్లో లిఖితపూర్వక ఫిర్యాదు అందించారు. ఈ సందర్భంగా స్వామి నాయక్ మాట్లాడుతూ ఒక పత్రికలో విద్యాశాఖ పై బోగస్ దందా అనే శీర్షికతో ప్రచురితమైన వార్తలు సీతానగరం మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో బోగస్ అడ్మిషన్స్ ఉన్నాయనీ, అది విద్యాశాఖ అధికారుల బాధ్యతా రాహిత్యమనీ, అవినీతి అనీ నిర్లక్ష్యం అని అనేక రకాలుగా ప్రభుత్వ మండల విద్యాశాఖ అధికారిని విద్యాశాఖను కించపరుస్తూ అవమాన ప్రచురించడం జరిగింది. అంతేకాకుండా విద్యాశాఖ అధికారి యొక్క సంస్కృతి సంప్రదాయాలను కించపరిచే విధంగా వ్రాయడమైనది అని అన్నారు. ఇటువంటి ఆరోపణల వలన ప్రభుత్వ పాఠశాలలను కించపరచడమేనని దీనిపై పోలీసు వారు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే మండలంలోని ఏ ప్రభుత్వ పాఠశాలల్లో కూడా బోగస్ అడ్మిషన్స్ గాని రోలు గానీ లేదు అని స్పష్టం చేశారు. కనీస అవగాహన లేకుండా వార్తలు రాయడం వలన ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా ఉన్నాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి ప్రభుత్వ పాఠశాలలను కించపరిచే విధంగా వార్తలు రాస్తే చట్టం ప్రకారం తీసుకునే హక్కు విద్యాశాఖ కమిషనర్ కు ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎమ్ భారతి, ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల బారినపడకుండా హాస్టల్ విద్యార్థు లకు అవగాహన కల్పించిన డాక్టర్ తిరణ్





**గోకవరం పెన్ పవర్ సెప్టెంబర్ 09:-**పరిసరాలు పరిశుభ్రత అవసరమని ప్రతీ వారం ఫ్రైడే డ్రైడే పాటించాలని తెలిపారు. త్రాగునీటి పరిశుభ్రత ప్రతి ఒక్కరూ పాటించాలని తద్వారా సీజనల్ వ్యాధులను తరిమి వేయవచ్చు అంటూ కొత్తపల్లి పిహెచ్సి వైద్యులు డాక్టర్ తిరణ్ విద్యార్థులతో అన్నారు. గోకవరం మండలం భూపతి పాలెం ప్రభుత్వ బాలుర రియడెన్సియల్ స్కూల్ నందు విద్యార్థులకు జి. కొత్తపల్లి పి .హెచ్. సి.వైద్యాధికారి డా.తిరన్ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.ఈ కార్యక్రమం లో స్కూల్ ప్రిన్సిపాల్ జి. అశోక్ కుమార్ సమక్షంలో విద్యార్థులకు ఆరోగ్యపరీక్షలు మరియు మంచి ఆరోగ్య అలవాట్లు దోమతెరలు ఏవిధంగా ఉపయోగించాలో తెలిపారు.మరియు ప్రస్తుత సీజన్ లో వచ్చే జ్వరాలు డెంగ్యూ, చికెన్ గున్య, మలేరియా వంటి వ్యాధులు బారినపడకుండా పరిసరాలు పరిశు భ్రత అవసరమని ప్రతీ వారం ఫ్రైడే డ్రైడే పాటించాలని తెలిపారు. త్రాగునీటి పరిశుభ్రత మరియు పౌష్టికాహారం గురించి ఆరోగ్య విద్య జరిపారు. ఈ కార్యక్రమం లో ఎమ్. ఎల్. హెచ్. పి లు దినేష్,కుమారస్వామి ఎ. పి. హెచ్. ఏ. ఆచారి నర్స్ గ్రేస్ తదితరులు పాల్గొన్నారు.

# పాత నేరస్తుడి 'చోరీ'కి చెక్..







- 25 లక్షలు విలువ చేసే చోరీ సొత్తు రికవరీ, 151.207 గ్రా బంగారం, 967 గ్రా వెండి స్వాధీనం
- 40 కేసుల నిందితుడు.. మళ్లీ పోలీసుల చేతికి!
- జైల నుంచి బయటకొచ్చి - మళ్ళీ చోరీలు

**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. సెప్టెంబర్ 09:**తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని వరుస దొంగతనాలకు పాల్పడుతున్న పాత నేరస్తుడిని తాడేపల్లిగూడెం పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. నరసాపురానికి చెందిన కొత్తపల్లి నరేష్ 40కి పైగా దొంగతనం కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు డీఎస్పీ రవిచంద్ర తెలిపారు.ఈ నెల 6, 27 తేదీల్లో తాడేపల్లిగూడెం హౌసింగ్ బోర్డు కాలనీ, రేలంగి సెంటర్‌లో జరిగిన రెండు ఇంటి దొంగతనాలను పోలీసులు ఛేదించారు. 2 ఇళ్ల దొంగతనాలు ఛేదింపు 25 లక్షలు విలువ చేసే చోరీ సొత్తు రికవరీ, జల్సాలు, ఆన్‌లైన్ పేకాట కోసం తాళం వేసిన ఇళ్లలో చోరీలకు పాల్పడినట్లు విచారణలో నరేష్ వెల్లడించినట్లు డీఎస్పీ తెలిపారు. జైలు నుంచి విడుదలైన కొద్ది రోజులకే మళ్లీ దొంగతనాలకు పాల్పడినట్లు పేర్కొన్నారు. దొంగిలించిన వస్తువులను శేషమహాల్ సెంటర్‌లోని ఓ దుకాణంలో విక్రయిస్తుండగా సీఐ బి. ఆదిప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు నరేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 151.207 గ్రాముల బంగారం, 967 గ్రాముల వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు డీఎస్పీ రవిచంద్ర తెలిపారు.

# తండ్రి నరిసే వీర్రాజు జ్ఞాపకార్థం మహిళా కళాశాలకు ఆర్వో వాటర్ ప్లాంట్ బహూకరణ

**మనం సమాజానికి ఇస్తే మనకు దేవుడు ఇస్తాడు : వక్తల ఉద్ఘాటన**

**తాడేపల్లిగూడెం,పెన్ పవర్ సెప్టెంబర్ 09 :** దానధర్మాలు దాతృత్వంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తనకు స్ఫూర్తి అని బిజెపి నాయకులు నరిసే సోమేశ్వరరావు అన్నారు. తన తండ్రి కీర్తిశేషులు నరిసే వీర్రాజు జ్ఞాపకార్థం తన తల్లి నరిసే జోగి రత్నం తాను కలిసి సుమారు లక్ష రూపాయలు విరాళంతో మహిళా కళాశాలకు ఆర్వో వాటర్ ప్లాంట్ బహూకరించినట్లు సోమేశ్వరరావు తెలిపారు. పట్టణంలోని భారతీయ విద్యా కేంద్రానికి చెందిన డిఆర్ గోయంక మహిళ జూనియర్ డిగ్రీ కళాశాలలకు ఈ ఆర్ వో వాటర్ ప్లాంట్ ను బహూకరించారు బుధవారం సాయంత్రం దీనిని ప్రారంభించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త నంద్యాల కృష్ణమూర్తి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈతకోట తాతాజీ ల చేతుల మీదుగా నరిసే సోమేశ్వరరావు ఈ ఆర్ వో వాటర్ ప్లాంట్ ను కళాశాల యాజమాన్యానికి అప్పగించారు ఈ సందర్భంగా సోమేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ విప్పు తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ దానధర్మాలు విరాళాలు దాతృత్వంలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉన్నారన్నారు అలాగే పి ఫోర్ లో భాగంగా దాతలను ప్రోత్సహించి విరాళాలను సమీకరించి పెద్ద ఎత్తున నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూ రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు సాధించారన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సొంత భవనం నిర్మాణం స్విమ్మింగ్ పూల్ ఇండోర్ స్టేడియం జిల్లా పరిషత్ హై స్కూల్ గ్రౌండ్ అభివృద్ధి వంటి పనులు దాతలు సహకారంతో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పూర్తి చేయడం అందరికీ గర్వకారణమన్నారు. ఆయన స్ఫూర్తితోనే తాను కూడా తనకున్న దాంట్లో కొంత మొత్తాన్ని సమాజం కోసం వెచ్చించాలని నిర్ణయించుకున్నారని సోమేశ్ చెప్పారు అందులో భాగంగానే పేద విద్యార్థులకు ఫీజులు చెల్లించడం సవిత్ర పేటలో మున్సిపల్ స్కూలు అభివృద్ధికి విరాళం ఇవ్వడం నేడు మహిళా కళాశాలకు ఆర్వో వాటర్ ప్లాంట్ ను బహూకరించడం వంటి సేవా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని వివరించారు ఇంకా పలువురు వక్తులు మాట్లాడుతూ మనకున్న దాంట్లో కొంత మొత్తాన్ని సమాజం కోసం వెచ్చిస్తే ఆ భగవంతుడు మనకు మరింత ఇస్తాడని ధర్మం చెబుతుందన్నారు దాని ప్రకారమే ప్రతి ఒక్కరూ దాతృత్వం చాటుకోవాలని కోరారు అలాగే ఈ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు ఎల్ఐసి విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు గరికపాటి బాపయ్య శర్మ కూడా 20వేల రూపాయలు మొత్తాన్ని వివరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా సోమేశ్వరరావు



మాట్లాడుతూ తన తండ్రి కీర్తిశేషులు నరిసే వీర్రాజు జ్ఞాపకార్థం తన తల్లి నరిసే జోగిరత్నం, తాను కలిసి కళాశాల విద్యార్థినులకు సురక్షితమైన త్రాగునీరు అందించాలనే సంకల్పంతో ఈ ఆర్వో ప్లాంట్ ను బహుకరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ముత్తా రామారావు, సుంకవల్లి రామకృష్ణ, ప్రిన్సిపాల్ వెంపరాల గణపతి రామ్, బిజెపి పట్టణ అధ్యక్షులు దువ్వా శ్రీనివాస్, టిడిపి నాయకులు వాడపల్లి సుబ్బరాజు, శ్రీ వాసవి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ గ్రంధి సత్యనారాయణ, పేరూరి కాశయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఒక్క పరుగుతో శతకం మిస్ చేసుకున్న తిలక్.. హాఫ్ సెంచరీ చేజార్చుకున్న తెలంగాణ డీజీపీ కొడుకు



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రతిష్టాత్మక దులీప్ ట్రోఫీ 2026 ఫైనల్ పోరులో సౌత్ జోన్ కెప్టెన్ తిలక్ వర్మకు తీరని గుండెకోత మిగిలింది. ఈస్ట్ జోన్ నమోదు చేసిన 708 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఒంటరి పోరాటం చేసిన తిలక్, కేవలం ఒక్క పరుగు దూరంలో (99 రన్స్ వద్ద) శతకాన్ని చేజార్చుకున్నాడు. రోజంతా ఈస్ట్ జోన్ బౌలర్ల సహనాన్ని పరీక్షించి, వీరోచితంగా పోరాడిన తిలక్.. నర్వస్ నైంటీస్‌లో సెంచరీకి ఒక్క అడుగు దూరంలో ఔట్ కావడంతో మైదానంలోనే తీవ్ర భావోద్వేగానికి గురయ్యాడు. తిలక్ వర్మ సెంచరీ మిస్ కావడంతో సౌత్ జోన్ డ్రెస్సింగ్ రూమ్‌తో పాటు అభిమానులు తీవ్ర నిరాశలో మునిగిపోయారు. మరోవైపు ఈ మ్యాచ్‌లో తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ కుమారుడైన చామ మిలింద్ కూడా దురదృష్టవశాత్తూ తన హాఫ్ సెంచరీని చేజార్చుకున్నాడు. సౌత్ జోన్ వికెట్లు వరుసగా పడుతున్న టైంలోనే క్రీజులోకి వచ్చిన మిలింద్, కెప్టెన్ తిలక్ వర్మతో కలిసి 78 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. 68 బంతుల్లో 7 ఫోర్లతో 43 రన్స్ చేసి ఊపుమీదున్న మిలింద్, స్పిన్నర్ శిఖర్ మోహన్ బౌలింగ్‌లో క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. బౌలింగ్‌లో 2 వికెట్లు తీసి, బ్యాటింగ్‌లోనూ 43 రన్స్ చేసిన మిలింద్ పోరాటం అభినందనీయమైనప్పటికీ, కేవలం 7 పరుగుల తేడాతో అర్ధ శతకం మిస్ అవ్వడం అతనికి తీవ్ర నిరాశ మిగిల్చింది.

**ఫాలో-ఆన్ గండంలో సౌత్ జోన్.. ఈస్ట్ జోన్ పేసర్ల దాడి:**

ఈ ఇద్దరు కీలక ప్లేయర్స్ ఔట్ కావడంతో సౌత్ జోన్ తొలి ఇన్నింగ్స్ ఆశలు పూర్తిగా ఆవిరయ్యాయి. ఈస్ట్ జోన్ నిర్దేశించిన 509 పరుగుల ఫాలో-ఆన్ మార్కును చేరుకోవడంలో సౌత్ జోన్ దారుణంగా ఫెయిల్ అయింది. ఈస్ట్ జోన్ స్టార్ వికెట్ కీపర్ ఇషాన్ కిషన్ కొట్టిన డబుల్ సెంచరీకి తోడు మహమ్మద్ షమీ, ముకేష్ కుమార్ ప్రాణాంతకమైన స్పెల్స్‌తో విరుచుకుపడటంతో సౌత్ జోన్ లోయర్ ఆర్డర్ క్యూ కట్టింది. దీంతో తొలి ఇన్నింగ్స్‌లోనే ఈస్ట్ జోన్ ఊహించని స్థాయిలో భారీ ఆధిక్యాన్ని సాధించి మ్యాచ్‌పై పూర్తి ఆధిపత్యం చెలాయించింది.

**వైభవ్ ఆల్-టైమ్ రికార్డ్.. దులీప్ ట్రోఫీ విన్నర్‌గా ఈస్ట్ జోన్:**

తిలక్ వర్మ సెంచరీ చేజారడం, చామ మిలింద్ పోరాటం ముగియడంతో ఈస్ట్ జోన్ దులీప్ ట్రోఫీ 2026 ఛాంపియన్‌గా నిలవడం ఇప్పుడు కేవలం లాంఛనంగా

మారింది. ఈ చారిత్రాత్మక విజయంతో 15 ఏళ్ల యంగ్ సంచలనం వైభవ్ సూర్యవంశీ దులీప్ ట్రోఫీ టైటిల్ గెలిచిన అత్యంత పిన్న వయస్కుడైన (యంగెస్ట్) ఆటగాడిగా ఆల్-టైమ్ రికార్డు సృష్టించబోతున్నాడు. తొలి ఇన్నింగ్స్‌లోనే 708 పరుగుల భారీ స్కోరుతో సౌత్ జోన్ వెన్నువిరిచిన ఈస్ట్ జోన్, దులీప్ ట్రోఫీ విజేతగా నిలిచి సరికొత్త చరిత్ర రాయడానికి రెడీ అయింది.

## ఐదు నెలల తర్వాత హార్దిక్ రీఎంట్రీ.. సాయి సుదర్శన్‌కు చోటు: ఇండియా‌ఏ స్క్వాడ్ ఇదిగో!




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా సుమారు ఐదు నెలల విరామం తర్వాత మళ్లీ పోటీ క్రికెట్‌లోకి అడుగు పెట్టబోతున్నాడు. వచ్చే నెల పుదుచ్చేరి వేదికగా ఆస్ట్రేలియా ఏ జట్టుతో జరగనున్న వైట్ బాల్ సిరీస్ కోసం బీసీసీఐ ఎంపిక చేసిన ఇండియా ఏ టీమ్ లో పాండ్యాకు చోటు లభించింది. అక్టోబర్ 6వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఈ 3 వన్డేల సిరీస్‌లో హార్దిక్ పాల్గొనడం అతడి ఫిట్‌నెస్ క్లియరెన్స్‌పై ఆధారపడి ఉంటుంది. ఇండియా ఏ జట్టులో ఎంపికవ్వడంతో వెస్టిండీస్‌తో జరగబోయే వన్డే సిరీస్‌కు పాండ్యా దూరం కానున్నాడు.

**కెప్టెన్లుగా రుతురాజ్ గైక్వాడ్, దేవదత్ పడిక్కల్:**

ఆస్ట్రేలియా ఏ జట్టుతో జరిగే ఈ ప్రతిష్టాత్మక సిరీస్ కోసం బీసీసీఐ ఇద్దరు యంగ్ స్టార్లకు సారథ్య బాధ్యతలు అప్పగించింది. సెప్టెంబర్ 22వ తేదీ నుంచి ప్రారంభమయ్యే రెండు మల్టీ-డే (4 రోజుల) మ్యాచ్‌ల సిరీస్‌కు కర్ణాటక స్టార్ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఇటీవల శ్రీలంక టెస్టు పర్యటనలో నంబర్-3 స్థానంలో వరుసగా రెండు సెంచరీలు కొట్టిన పడిక్కల్ సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. ఇక అక్టోబర్ 6 నుంచి జరిగే 50 ఓవర్ల వన్డే సిరీస్‌కు రుతురాజ్ గైక్వాడ్ కెప్టెన్‌గా ఎంపిక కాగా, పడిక్కల్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు.

**ఫిట్‌నెస్ టెస్ట్ పాసైతేనే గ్రౌండ్‌లోకి.. వెస్టిండీస్ సిరీస్‌కు పాండ్యా దూరం:**

హార్దిక్ పాండ్యా రాక కోసం అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్నప్పటికీ, వైట్ బాల్ సిరీస్ లో అతను ఆడటం అనేది ఎన్‌సీఏ (బీజూ) ఇచ్చే ఫిట్‌నెస్ సర్టిఫికేట్‌పైనే మాత్రమే ఆధారపడి ఉంది. ఒకవేళ పాండ్యా పూర్తి ఫిట్‌నెస్ సాధిస్తే మ్యాచ్ ప్రాక్టీస్ కోసం ఇండియా ఏ తరఫున ఆస్ట్రేలియా ఏపై విరుచుకుపడేందుకు సిద్ధమవుతాడు. ఆసియా గేమ్స్ క్యాంపెయిన్, విండీస్ సిరీస్ ల నేపథ్యంలో సీనియర్ ప్లేయర్స్ అందుబాటులో లేకపోవడంతో యంగ్ ప్లేయర్లను, ఐపీఎల్ 2026లో మెరిసిన స్టార్లను ఎంపిక చేసినట్లు బీసీసీఐ చీఫ్ సెలెక్టర్ల కమిటీ స్పష్టం చేసింది.

**ఇండియా 'ఏ' పూర్తి స్క్వాడ్స్:**

మల్టీ-డే జట్టు (4 రోజుల మ్యాచ్‌లు): దేవదత్ పడిక్కల్ (కెప్టెన్), సాయి సుదర్శన్ (వైస్ కెప్టెన్), అమన్ మోఖడే, ఆయుష్ పాండే, యశ్ రాథోడ్, షేక్ రషీద్, కుమార్ కుశాగ్ర (వికెట్ కీపర్), షామ్స్ ములానీ, తనుష్ కొటియాన్, తుషార్ దేశ్‌పాండే, అంశుల్ కంబోజ్, ప్రాఫుల్ హింగే, ఎన్ జగదీసన్ (వికెట్ కీపర్), నాచికేత్ భుతే, వి వైశాఖ్.

వన్డే జట్టు (50 ఓవర్ల సిరీస్): రుతురాజ్ గైక్వాడ్ (కెప్టెన్), దేవదత్ పడిక్కల్ (వైస్ కెప్టెన్), ప్రియాన్ష్ ఆర్య, సాయి సుదర్శన్, రజత్ పటీదార్, కుమార్ కుశాగ్ర (వికెట్ కీపర్), నిశాంత్ సింధు, విప్రాజ్ నిగమ్, అర్షిన్ కులకర్ణి, అర్షద్ ఖాన్, నమన్ ధీర్, హార్దిక్ పాండ్యా (ఫిట్‌నెస్‌కు లోబడి), ప్రభ్‌సిమ్రన్ సింగ్ (వికెట్ కీపర్), గుర్జాప్‌నీత్ సింగ్, యశ్ ఠాకూర్.

## దులీప్ ట్రోఫీ: ఇషాన్ కిషన్ మరోసారి విధ్వంసం.. ఈస్ట్ జోన్‌కు 584 పరుగుల భారీ ఆధిక్యం

**హైదరాబాద్ పెన్ పవర్:** దులీప్ ట్రోఫీ ఫైనల్‌లో సౌత్ జోన్‌పై ఈస్ట్ జోన్ పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించి తన పట్టును మరింత బిగించింది. చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియం వేదికగా బుధవారం జరిగిన నాలుగో రోజు ఆటలో, కెప్టెన్ ఇషాన్ కిషన్ (80), శిఖర్ మోహన్ (52) అద్భుతమైన హాఫ్ సెంచరీలతో రాణించారు. దీంతో ఆట ముగిసే సమయానికి ఈస్ట్ జోన్ ఏకంగా 584 పరుగుల భారీ ఆధిక్యం సాధించి, టైటిల్‌ను దాదాపు ఖాయం చేసుకుంది.

**ఇషాన్, మోహన్ అద్భుత భాగస్వామ్యం**

తొలి ఇన్నింగ్స్‌లో 372 పరుగుల భారీ ఆధిక్యం ఉన్నప్పటికీ, ఈస్ట్ జోన్ ఫాలో ఆన్ విధించకుండా రెండో ఇన్నింగ్స్ ప్రారంభించింది. అయితే, ఓపెనర్లు వైభవ్ సూర్యవంశీ (8), అభిమన్యు ఈశ్వరన్ (0) విఫలమవడంతో ఆరంభంలో తడబడింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన ఇషాన్ కిషన్, శిఖర్ మోహన్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 170 బంతుల్లో 126 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. ముఖ్యంగా ఇషాన్ కిషన్ తనదైన శైలిలో విధ్వంసక బ్యాటింగ్‌తో అలరించాడు. కేవలం 98 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లతో 80 పరుగులు చేశాడు. విజయ్ వేసిన ఒకే ఓవర్లో రెండు సిక్సర్లు, రెండు ఫోర్లతో 20 పరుగులు రాబట్టి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. మరో భారీ షాట్‌కు ప్రయత్నించి కిషన్ ఔటవగా, నిలకడగా ఆడిన శిఖర్ మోహన్ (52) కూడా పెవిలియన్ చేరాడు.

**ఒక్క పరుగుతో శతకం చేజార్చుకున్న తిలక్ వర్మ**

అంతకుముందు, ఉదయం సెషన్‌లో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన సౌత్ జోన్ 336 పరుగులకు ఆలౌటైంది.

కెప్టెన్ తిలక్ వర్మ అద్భుత పోరాట పటిమ కనబరిచాడు. అయితే, దురదృష్టవశాత్తూ ఒక్క పరుగు తేడాతో తన తొమ్మిదో ఫస్ట్‌క్లాస్ సెంచరీని చేజార్చుకున్నాడు. 99 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద కౌనైన్ ఖురేషీ బౌలింగ్‌లో రిటర్న్ క్యాచ్ ఇచ్చి నిరాశగా వెనుదిరిగాడు. మరో ఎండ్‌లో సీవీ మిలింద్ (43) అతనికి చక్కటి సహకారం అందించాడు. వీరిద్దరి నిష్క్రమణ తర్వాత సౌత్ జోన్ ఇన్నింగ్స్ త్వరగా ముగిసింది. ముఖేష్ కుమార్ 3 వికెట్లతో రాణించాడు.

నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి ఈస్ట్ జోన్ రెండో ఇన్నింగ్స్‌లో 5 వికెట్ల నష్టానికి 212 పరుగులు చేసింది. కుమార్ కుశాగ్ర (34 నాటౌట్), ఖురేషీ (26 నాటౌట్) క్రీజులో ఉన్నారు. చివరి రోజు ఆట నామమాత్రమే కాగా, ఈస్ట్ జోన్ విజయం లాంఛనమేనని క్రీడా విశ్లేషకులు భావిస్తున్నారు.

## వార్‌లో 'దాదా' బాలకృష్ణ.. 3 నెలల ముందే 'కింగ్' గేమ్ స్టార్ట్!





ఈ ఏడాది క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 24న ఇండియన్ బాక్సాఫీస్ వద్ద ఊహించని రీతిలో ముగ్గురు అగ్ర కథానాయకుల మధ్య భారీ పోరు షురూ అయింది. ఇది నువ్వా నేనా? అంటూ సాగే ఒక భీకర సమరం. టాలీవుడ్ 'కింగ్' అక్కినేని నాగార్జున నటిస్తున్న మైలురాయి చిత్రం 'కింగ్ 100' బరిలోకి దిగుతుండగా, నటసింహం నందమూరి బాలకృష్ణ తన మాస్ యాక్షన్ పవర్ ప్యాక్డ్ 'దాదా' తో పోటీపడుతున్నారు. వీరికి తోడు బాలీవుడ్ బాద్‌షా షారూఖ్ ఖాన్ తన మోస్ట్ అవైటెడ్ పాన్-ఇండియా యాక్షన్ థ్రిల్లర్ -కింగ్-తో బాక్సాఫీస్‌ను షేక్ చేయడానికి సిద్ధమయ్యారు. డిసెంబర్ 24నే ఈ ముగ్గురూ తమ సినిమాలను విడుదల చేస్తుండటంతో ఆ తేదీకి దాదాపు మూడు నెలల ముందే తెలుగు రాష్ట్రాల్లో థియేటర్ల ఆధిపత్య పోరు - బిజినెస్ గేమ్ హోరాహోరీగా ప్రారంభమైంది.అక్కినేని నాగార్జున తన కెరీర్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 100వ చిత్రంగా 'ఖఱఅస్త్ర100'ను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. "నాతో డబ్బు లేనప్పుడు లూజర్ అన్నారు.. డబ్బు ఉన్నప్పుడు కింగ్ అన్నారు.. కానీ నా గుర్తింపు డబ్బు కంటే శక్తివంతమైనది" అనే కాన్సెప్ట్‌తో వస్తున్న ఈ చిత్రం.. ఒక మనిషి అధికారం - స్వయంకృషితో ఎదిగిన ప్రయాణాన్ని అత్యంత గ్రిప్పింగ్‌గా ఆవిష్కరించబోతోంది. నాగార్జున స్వయంగా అన్నపూర్ణ స్టూడియోస్ డిస్ట్రిబ్యూషన్ వింగ్ ద్వారా తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటినుంచే థియేటర్ల యజమానులతో ఒప్పందాలు కుదుర్చుకుంటూ బాక్సాఫీస్ స్పేస్‌ను సొంతం చేసుకోవడంలో వేగంగా పావులు కదుపుతున్నారు. థియేటర్ల రేసులో మూడు నెలల ముందే కింగ్ హవా చూపిస్తుండటం ఇప్పుడు ఫిలింనగర్ లో చర్చగా మారింది. కంటెంట్ పరంగా ఎమోషన్- క్లాస్- మాస్ ఎలిమెంట్స్ మేళవింపుగా వస్తున్న -కింగ్ 100- పోటీలో నాగార్జునకు మైలేజ్ ఇచ్చేలా కనిపిస్తోంది.

మరోవైపు నందమూరి బాలకృష్ణ -దాదా- రూపంలో భీకరమైన మాస్ పవర్‌తో థియేటర్లపైకి దండయాత్రకు సిద్ధమయ్యారు. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో 1980ల నాటి ముంబై గ్యాంగ్‌స్టర్ కథాంశంతో చారిత్రాత్మక టైమ్‌లైన్ కలయికతో తెరకెక్కుతున్న ఈ సినిమాలో బాలయ్య -కింగ్ ఆఫ్ కేయాస్-గా కనిపించనున్నారు. థమన్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్... మాస్ డైలాగ్‌లు.. ముంబై పోలీసులను సైతం శాసించే పవర్‌ఫుల్ డాన్ పాత్రలో బాలయ్య విశ్వరూపం తెలుగు రాష్ట్రాల్లో ఓపెనింగ్స్ పరంగా భారీ రికార్డులను తిరగరాయడానికి సిద్ధంగా ఉంది. బి, సి సెంటర్లలో బాలకృష్ణకు ఉన్న తిరుగులేని మాస్ ఫాలోయింగ్ ఈ క్రిస్మస్ రేసులో -దాదా-ను అత్యంత బలీయమైన ప్రత్యర్థిగా నిలబెడుతోంది.

ఈ తెలుగు దిగ్గజాల పోరు మధ్యలోకి బాలీవుడ్ బాద్‌షా షారూఖ్ ఖాన్ -కింగ్- సైలెంట్ గా ఎంట్రీ ఇస్తుండటం వాతావరణాన్ని మరింత వేడెక్కించింది. సుహాస్ వర్మ, సిద్దార్థ్ ఆనంద్ కాంబినేషన్ నుండి వస్తున్న ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో షారూఖ్ సిల్వర్ హెయిర్ లుక్‌తో సరికొత్త అవతారంలో కనిపించనున్నారు. "సౌ దేశోం మే బద్నామ్.. దునియా నే దియా సిర్ఫ్ ఏక్ హి నామ్ - కింగ్" అనే గ్లోబల్ ప్రొఫైల్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా తెలుగు హక్కులను దక్కించుకోవడానికి స్థానిక అగ్ర నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు పోటీపడుతున్నారు. నార్త్ బెల్ట్ - గ్లోబల్ మార్కెట్‌లో ఈ చిత్రం భారీ కలెక్షన్లు సాధిస్తుందనే అంచనాలున్నా దక్షిణ భారతదేశంలో ముఖ్యంగా తెలుగు మార్కెట్‌లో థియేటర్లను దక్కించుకోవడం ఈ బాలీవుడ్ -కింగ్-కి పెద్ద సవాలుగా మారింది.షారూఖ్ ఖాన్‌కు తన పాన్-ఇండియా స్టార్‌డమ్‌ను నిలబెట్టుకోవడానికి - సౌత్ మార్కెట్‌లో తన పట్టును మరింత బలోపేతం చేసుకోవడానికి -కింగ్- విజయం అత్యంత కీలకం. పఠాన్, జవాన్ చిత్రాలతో సౌత్‌లో భారీ వసూళ్లు రాబట్టిన షారూఖ్ ఈసారి నేరుగా నాగార్జున -కింగ్ 100-, బాలకృష్ణ -దాదా- వంటి పక్కా ప్రాంతీయ దిగ్గజాలతో ఒకే రోజు పోటీపడుతుండటంతో బాక్సాఫీస్ యుద్ధం రసవత్తరంగా మారింది. క్రిస్మస్ పండుగ సీజన్ పెద్ద సినిమాలకు అనుకూలమైనదే అయినా థియేటర్ల కేటాయింపులు, స్క్రీన్ల లభ్యత విషయంలో నాగార్జున పక్కా ప్లానింగ్‌తో ఉండటం.. బాలయ్య మాస్ స్టామినా బలంగా నిలవడం వల్ల తెలుగు గడ్డపై ఈ ముగ్గురు -కింగ్-ల మధ్య సమరం సరికొత్త చరిత్ర సృష్టించబోతోంది.

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965